Follow: @ANNTELUGU
ANN తెలుగు
26-06-2025
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 203 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## రోదసిలోకి శుభాంశు శుక్లా..

నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ 9 రాకెట్

అంతరిక్ష యాత్ర చరిత్రలో మరో సువర్ణాధ్యాయం

నలభై ఏళ్ల తర్వాత అంతరిక్షంలోకి భారతీయుడు

యాక్సియమ్4 మిషన్‌లో భాగంగా పక్షం రోజుల పాటు యాత్ర

వివరాలు 4లో

**టాప్ న్యూస్**

### జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేస్తున్నాం.. గెలుస్తున్నాం



- సర్పంచ్ ఎన్నికలపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తాం
- ఫోన్ ట్యాప్ చేసే హక్కు కేసీఆర్, కేటీఆర్ కు ఎవరిచ్చారు?
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

03


### బీజేపీలోకి మీనా?



- భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలవడంతో రాజకీయంగా ఆసక్తికర చర్చ
- వైరల్ గా ఫొటోలు

02

### అరవింద్‌కు మళ్లీ పిలుపు



- ఈ రేస్ కేసులో ఏసీబీ నోటీసులు
- జులై 1న విచారణకు రావాలని ఆదేశాలు
- కొద్ది రోజులుగా విదేశాల్లోనే ఉంటున్న అరవింద్ కుమార్
- ఏసీబీ విచారణకు హాజరవుతారా.. లేదా అనేది ఉత్కంఠ

02



రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని రాష్ట్ర ఐ&పీఆర్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సిఎచ్.ప్రియాంక బుధవారం నాడు మంత్రుల నివాస సముదాయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.




### తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతకు ప్రశంస

- ముఖ్యమంత్రి రేవంత్‌కి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ
- ఇటీవల ఢిల్లీలో రేవంత్‌తో టోనీ బ్లెయిర్ భేటీ
- పెట్టుబడులు, ఐటీ, ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలపై చర్చ
- టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్‌తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం
- తెలంగాణ విజన్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామన్న బ్లెయిర్

03




### రిజర్వేషన్లపై కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దన్న సుప్రీంకోర్టు నిబంధనతో ప్రభుత్వం ఏం చేయాలన్న దానిపై దృష్టి సారించింది. కేంద్రం నుంచి బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్ రాకపోతే పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధమవుతోంది. అంటే 42 శాతం మంది బీసీలకు టికెట్లు ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ ఉంది.

# స్థానిక సమరానికి సై

## మూడునెలల్లో కొత్త పాలకమండళ్లు

- సెప్టెంబర్ 30 కల్లా పంచాయతీలు.. పరిషత్ లకు పాలక కళ
- 31 జడ్పీలకు ఎన్నికలు.. 12,633 సర్పంచ్ లకు ఎన్నికలు

స్థానిక సమరానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 90 రోజుల్లో సెప్టెంబర్ 30 కల్లా ఎన్నికలు పూర్తిచేయాలని ఆదేశించడంతో.. ఇక ప్రభుత్వం కూడా సై అంటోంది. బిసి రిజర్వేషన్లపై ఒత్తిడి తెస్తూనే మరోవైపు ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని కూడా సన్నద్ధం చేయనుంది. గతేడాది అంటే 2024 ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేకపోయింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో నల్గొండకు చెందిన సర్పంచ్‌లు పిటిషన్ వేశారు. ఈ విషయమై రిజర్వేషన్లు, వార్డు డివిజన్ ప్రక్రియ చేపట్టడానికి 25 రోజుల సమయం కావాలని ప్రభుత్వం కోర్టును కోరింది. - మహా, హైదరాబాద్

వివరాలు 2లో



## జూబ్లీహిల్స్ అభ్యర్థిగా మాగంటి సునీత?

### కేసీఆర్ డిసైడ్.. నేతలకు సంకేతం

నెలాఖరుకల్లా ఫైనల్

ఎన్నికను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గులాబీ దళపతి

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందగా, ఉప ఎన్నిక అనివార్యమైంది. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి వరకూ సిట్టింగ్ ఎమ్మెల్యే మరణిస్తే, తిరిగి ఆ కుటుంబంలోని వ్యక్తులకే ఎమ్మెల్యే సీటు కేటాయించడంతోపాటు, మిగతా పార్టీలు కూడా పోటీకి దూరంగా ఉండేవి. కానీ కేసీఆర్ ఆ ఆనవాయితీకి చెక్ పెట్టేశారు. మరో నాలుగు మాసాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయపార్టీలు బైపోల్ కు సిద్ధమయ్యాయి.

మిగతా 2లో

## ట్రంప్ అంత ఈజీ కాదు

04




# స్థానిక సమరానికి సై

## మూడునెలల్లో కొత్త పాలకమండళ్లు

### సెప్టెంబర్ 30 కల్లా పంచాయతీలు.. పరిషత్ లకు పాలక కళ

### 31 జడ్పీలకు ఎన్నికలు.. 12,633 సర్పంచ్ లకు ఎన్నికలు



**హైదరాబాద్, మహా**

స్థానిక సమరానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 90 రోజుల్లో సెప్టెంబర్ 30 కల్లా ఎన్నికలు పూర్తిచేయాలని ఆదేశించడంతో.. ఇక ప్రభుత్వం కూడా సై అంటోంది. బిసి రిజర్వేషన్లపై ఒత్తిడి తెస్తూనే మరోవైపు ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని కూడా సన్నద్ధం చేయనుంది. గతేడాది అంటే 2024 ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేకపోయింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో నల్గొండకు చెందిన సర్పంచ్‌లు పిటిషన్ వేశారు. ఈ విషయమై రిజర్వేషన్లు, వార్డు డివిజన్ ప్రక్రియ చేపట్టడానికి 25 రోజుల సమయం కావాలని ప్రభుత్వం కోర్డును కోరింది. అదే సమయంలో కనీసం 60 రోజుల సమయం కావాలని ఎన్నికల కమిషన్ కోరింది. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని తీర్పునిచ్చింది.

**రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు 12,633**

2019 ఎన్నికల ప్రకారం రాష్ట్రంలో 12,848 గ్రామ పంచాయతీలున్నాయి. ఆ తర్వాత వాటిలో 71 గ్రామాలు ఫ్యూచర్ సిటీలో విలీనమైనందున మిగిలినవి 12,777 గ్రామ పంచాయతీలు. వీటిలో కొన్ని మున్సిపాలిటీల్లో విలీనం కాగా మిగిలినవి 12,633 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. గతంలో మహిళలకు 50% రిజర్వేషన్ అమలైనందున ఈసారి కూడా వారికి సగం సీట్లు దక్కనున్నాయి. గతంలో 2.02 కోట్ల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుచేశారు. ఇప్పుడు కొన్ని గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనమైనందున గ్రామీణ జనాభా 1.90 కోట్లకు చేరింది. దీని ప్రకారం ఈసారి బీసీలకు 2022%, ఎస్సీలకు 1820%, ఎస్టీలకు 810% సీట్లు కేటాయించే అవకాశం ఉన్నది. రొటేషన్ అమలుకు ప్రభుత్వం చట్టం చేసినందున గతంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ స్థానాలు ఇప్పుడు మారుతాయి. ఎస్సీ సీటు బీసీ లేదా జనరల్‌కు కేటాయించే అవకాశం ఉంటుంది. గ్రామపంచాయతీలతో పాటు 539 మండల ప్రజా పరిషత్ పాలకవర్గాల గడువు నిరుడు ఫిబ్రవరి 1తో ముగిసింది. 28 జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు 2024 జూలై 5వ తేదీతో ముగియగా.. ములుగు, ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్ జెడ్పీలతోపాటు ఆ 4 జిల్లాల్లోని మండల పరిషత్ పాలకవర్గాల గడువు 2024 ఆగస్టు 5తో ముగిసింది. వీటన్నింటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

**ముందుగా పరిషత్**

ఇక గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీ స్థానిక సంస్థల్లో ముందుగా పరిషత్ నిర్వహించాలా.. గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలా అని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 12,633 పంచాయతీలు ఉన్నాయి. వాటన్నింటికి ఎన్నికలు జరుగుతాయి. ఈ పంచాయతీలన్నింటిలో సుమారు 1,13,500కుపైగా వార్డులున్నాయి. కాగా కొన్ని గ్రామ పంచాయతీలు మునిసిపాలిటీల్లో కలిసే అవకాశం ఉంది. ఆ పంచాయతీల్లోని వార్డులుపోగా.. మిగతా వాటికి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు 5,817 ఎంపీటీసీ, 567 ఎంపీపీ, 567 జడ్పీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. జడ్పీటీసీ ఎన్నికలు ముగియగానే హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి మినహా మిగిలిన 31 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. ఈ ప్రక్రియనంత సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# జూబ్లీహిల్స్ అభ్యర్థిగా మాగంటి సునీత?

(మొదటిపేజీ తరువాయి)



గులాబీదళపతి కేసీఆర్ మాగంటి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా టికెట్ మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకే ఇచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ దిశగా ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కష్టకాలంలో పార్టీని నమ్ముకోవడంతోపాటు, అధికార పార్టీ ఆకర్షణకు లొంగకుండా తన విధేయత చాటుకున్న మాగంటి గోపీనాథ్ కుటుంబంలో ఆసక్తి ఉన్నవారికే ఎమ్మెల్యే సీటు కేటాయించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ క్రమంలో ఆమె సతీమణి పేరు బలంగా వినబడుతోంది. త్వరలో మాగంటి కుటుంబం కేసీఆర్ ను కలవనుండగా, అభ్యర్థిత్వంపై లాంఛనంగా ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ సీటును పిజెఆర్ తనయుడు విష్ణు వర్ధన్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి కూడా ఆశిస్తున్నట్లు కనబడుతోంది.

**కాంగ్రెస్ నుంచి ఎవరు..**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. ఇటీవల కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని బైపోల్ లో గెలుచుకున్న కాంగ్రెస్ ఇపుడు జూబ్లిహిల్స్ లో పాగా వేయాలని డిసైడైంది. హైదరాబాద్ లో జూబ్లీహిల్స్ కీలకమైన నియోజకవర్గం కావడంతో ఈసారి హస్తం జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ పోటీచేశారు. అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్ కు గట్టి పోటీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ లో మైనారిటి ఓట్లు అభ్యర్థుల గెలుపోటములు ప్రభావితం చేస్తాయి. . ఇదిలా ఉంటే కాంగ్రెస్ లో అజార్ కు పోటీగా గట్టి లాబియింగ్ జరుగుతోంది. అనేక పర్లు ప్రచారంలో వినపడుతున్నాయి. ఫహీం ఖురేషీ, నవీన్ యాదవ్ , విజయారెడ్డి తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. బిజెపి నుండి లంకల దీపక్ రెడ్డి, కీర్తిరెడ్డి పేర్లు వినబడుతున్నాయి.

# రోదసిలోకి శుభాంశు శుక్లా..

- నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ 9 రాకెట్
- అంతరిక్ష యాత్ర చరిత్రలో మరో సువర్ణాధ్యాయం
- నలభై ఏళ్ల తర్వాత అంతరిక్షంలోకి భారతీయుడు
- యాక్సియమ్-4 మిషన్‌లో భాగంగా పక్షం రోజుల పాటు యాత్ర



**ఇంటర్నెట్ డెస్క్, మహా:** అంతరిక్ష ప్రయోగాల్లో తనదైన శైలితో దూసుకుపోతున్న భారత్.. ఆ ప్రయాణంలో కీలక ముందడుగు వేసింది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా.. తన తొలి, భారతీయుల రెండవ అంతరిక్ష యాత్రకు వెళ్లాడు. ఫ్లోరిడాలోని నాసా అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ 9 రాకెట్‌లోని స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్‌లో శుభాంశు కూడా ఉన్నాడు. స్పేస్ సెంటర్ లాంచ్ కాంప్లెక్స్ 39ఏ నుంచి ఈ రాకెట్ బయల్దేరింది. 1969లో చంద్రుని పైకి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ బయల్దేరిన అపోలో 11 కూడా ఇదే లాంచ్ ప్యాడ్ నుంచి వెళ్లటం విశేషం.

**మళ్లీ నాలుగు దశాబ్దాల తర్వాత..**

1984లో వింగ్ కమాండర్ రాకేశ్ శర్మ నాటి సోవియట్ రష్యా మిషన్‌లో భాగంగా రోదసిలోకి వెళ్లాడు. మళ్లీ నాలుగు దశాబ్దాల తర్వాత గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా ఈ ఘనత సాధించాడు. అంతరిక్ష ప్రయాణం నేపథ్యంలో ఆరోగ్యంగా ఉండే క్రమంలో ఆయన నెలరోజులకు పైగా క్వారంటైన్‌లో ఉన్నారు. మిషన్ పైలట్‌గా వ్యవహరిస్తున్న శుక్లాతో పాటు.. అంతరిక్ష నిపుణులు పోలాండ్‌కు చెందిన స్లావోజ్ ఉజ్నాన్‌స్కీవిస్నియెస్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కాపు, యుఎస్‌కు చెందిన కమాండర్ పెగ్గీ విట్సన్ ఈ అంతరిక్ష నౌకలో ఉన్నారు.

**'నాకోసం చూస్తూ ఉండండి..**

ఆక్సియం 4 మిషన్‌లో భాగంగా ఈ నలుగురు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళుతున్నారు. పదిహేను రోజులపాటు సాగే ఈ మిషన్‌లో ఈ బృందం సుమారు 60 శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించనున్నది. వాటిలో ఏడింటిని భారత పరిశోధకులు ప్రతిపాదించారు. అంతరిక్షం నుంచి ఒక వీఐపీతో శుక్లా సంభాషించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. సాధారణంగా భారతదేశంలోని వీఐపీ అనగానే మొదట గుర్తుకు వచ్చేది ప్రధాన మంత్రి నరేంద్రమోదీ. దీంతో.. ఆ వీఐపీ మోదీయే అయి ఉంటారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్సియం 4 మిషన్ వాతావరణ ప్రతికూల పరిస్థితులు, సాంకేతిక లోపాల కారణంగా అనేక సార్లు వాయిదా పడింది. ఇప్పుడు బయల్దేరిన జూన్ 25.. నాసా ప్రకటించిన ఆరో తేదీ. సుమారు 28 గంటలపాటు కక్ష్య ప్రయాణం తర్వాత ఆక్సియం 4 మిషన్ భారతీయ కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లోకి వెళ్లనున్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన గ్రూప్ కెప్టెన్ శుక్లా.. తాను సాధనాలు, పరికరాలు మాత్రమే తీసుకొని వెళ్లడం లేదని, కోట్ల హృదయాల ఆశలు, కలలను తనతో తీసుకువెళుతున్నానని చెప్పారు. తన చరిత్రాత్మక ప్రయాణానికి కొన్ని గంటల ముందు తన కుటుంబానికి ఒక సందేశం పంపిన శుక్లా.. 'నాకోసం చూస్తూ ఉండండి.. నేను వచ్చేస్తున్నాను..' అని పేర్కొన్నారు.

# నేటి నుంచే ఆషాఢమాసం బోనాలు

- గోల్కొండలో మొదటి బోనంతో అంకుర్పారణ
- బోనాల వేళ భాగ్య నగరమంతా ప్రత్యేక శోభ
- నెలరోజుల పాటు శోభాయమానంగా సాగనున్న పండుగ



**హైదరాబాద్, మహా:** అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి ఏడాది తొలుత గోల్కొండలో జగదాంబిక అమ్మవారికి బంగారు బోనం సమర్పించడంతో భాగ్యనగరంలో బోనాల సందడి షురూ అవుతుంది. గోల్కొండ తర్వాత ఉజ్జయిని మహంకాళికి, లాల్ దర్వాజ మాహాకాళికి బోనాలు నిర్వహిస్తారు. తిరిగి గోల్కొండ కోటలో చివరి బోనంతో భాగ్యనగరంలో ఈ ఉత్సవాలను ముగుస్తాయి.

**తొమ్మిది రకాల పూజలు..**

నేడు జగదాంబిక అమ్మవారికి మొదటి బోనాన్ని పచ్చి కుండతో సమర్పిస్తారు. ఆషాడమాసంలో ప్రతి ఆదివారం, గురువారం.. మొత్తంగా తొమ్మిది రకాల పూజలను అమ్మవారు అందుకుంటారు. ఇందుకు సంబంధించిన షెడ్యల్‌ను పరిశీలిస్తే నేడు మొదటి బోనం, జూన్ 29వ తేదీ (ఆదివారం) రెండో బోనం, జూలై 3వ తేదీ (గురువారం) మూడవ బోనం, జూలై 6వ తేదీ (ఆదివారం) నాల్గో బోనం, జూలై 10వ తేదీ (గురువారం) ఐదవ బోనం, జూలై 13వ తేదీ (ఆదివారం) ఆరో బోనం, జూలై 17వ తేదీ గురువారం ఏడో బోనం, జూలై 20వ తేదీ(ఆదివారం) 8వ బోనం, జూలై 24వ తేదీ (గురువారం) 9వ బోనం నిర్వహించనున్నారు. ఇదిలాఉంటే, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు జూలై 13న, లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాలు జూలై 20న జరగనున్నాయి.

**ఘన చరిత్ర కలిగిన బోనాలు..**

దాదాపు వెయ్యేళ్ల చరిత్ర గల ఈ బోనాలు మొట్టమొదటిసారిగా కాకతీయ రాజులలో ఒకరైన ప్రతాప రుద్రుడు గోల్కొండలోని శ్రీ జగదాంబిక ఆలయంలో బోనాల సమయంలో ప్రత్యేక పూజలు చేసినట్లుగా తెలుస్తోంది.

**తొలి బోనం ఇక్కడే..**

ప్రతాప రుద్రుని తర్వాత వచ్చిన ముస్లిం నవాబులు సైతం ఇక్కడ పూజలు జరుపుకునేందుకు అనుమతి ఇచ్చారని తెలుస్తోంది. ఆనాటి నుంచి భాగ్యనగరంలో గోల్కొండ లోని అతి పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన జగదాంబిక అమ్మవారి ఆలయంలో తొలి బోనాలు ఎత్తడం సంప్రదాయంగా వస్తోంది.

**రెండు మూడు నాలుగు ఇక్కడే!..**

బోనాల ఉత్సవాల్లో భాగంగా రెండో వారం బల్కంపేట రేణుక ఎల్లమ్మ గుడిలో, బోనం ఎత్తుతారు. మూడో వారం సికింద్రాబాదులోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనం ఎత్తుతారు. నాలుగో వారం లాల్ దర్వాజాలోని శ్రీ మహంకాళి ఆలయంలో బోనం ఎత్తుతారు.

**బోనాల వెనుక ఆచారం..**

తెలుగు సంప్రదాయం ప్రకారం ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో అమ్మవారు పుట్టింటికి వస్తుందని అందుకే అమ్మవారికి ప్రీతికరమైన భోజనం, చీర, సారెలు సమర్పిస్తారని విశ్వాసం. ఒక కుటుంబం తమ కుమార్తెను తమ ఇంటికి తిరిగి వస్తే ఎంత ప్రేమగా స్వాగతిస్తారో, అదే విధంగా, భక్తులు అమ్మవారికి ఆప్యాయత అనురాగాలతో సాంప్రదాయ రీతిలో బోనాలు సమర్పిస్తారు.

**అమ్మవారి వివిధ రూపాలు..**

జగదాంబిక అయిన ఆ తల్లి ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలవబడుతో పూజలందుకుంటూ ఉంటుంది. మహంకాళి, ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి, నూకాలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి, మైసమ్మ, బాలమ్మ, ముత్యాలమ్మ ఇలా పేర్లు వేరైనా తల్లి ఒక్కటే!

**మొక్కులు ఇలా..**


బోనాల సందర్భంగా తమను ఆపదల నుంచి గట్టెకించినందుకు కృతజ్ఞతగా అమ్మవారి సమక్షంలో కోళ్లు, మేకలను కూడా బలి ఇస్తుంటారు. ఇవన్నీ వారి వారి విశ్వాసం మీద ఆధారపడిన విషయాలు.

**పోతురాజుల విన్యాసాలు..**

బోనాల సందర్భంగా కొరడాలతో కొట్టుకుంటూ పోతురాజులు చేసే విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**రంగం - భవిష్యవాణి..**

బోనాల జాతరలో అతి ముఖ్యమైన ఘట్టం భవిష్యవాణి. అమ్మవారి స్వరూపంగా భావించే మహిళ ఈ సందర్భంగా వినిపించే భవిష్యవాణి కీలకం. భవిష్యవాణి లో వర్షాలు ఎలా కురుస్తాయో చెప్పడంతో పాటు ప్రజలు సుఖశాంతులతో జీవించాలంటే ఏమి చేయాలి అనే విషయాలు ప్రధానంగా తెలియజేయడం జరుగుతుంది.



# బీజేపీలోకి మీనా?

## వైరల్ గా ఫొటోలు

**మహా:** ప్రముఖ సినీ నటి మీనా ఇటీవల భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో మీనా బీజేపీలో చేరనున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఒకప్పుడు తమిళ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా పేరుపొందిన మీనా, తన 45 ఏళ్ల సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ వంటి పలు భాషల్లో నటించి విశేష ప్రేక్షకాదరణ పొందారు. ఆమె భర్త విద్యాసాగర్ 2022లో అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే.

ప్రస్తుతం మీనా తన కుమార్తె నైనికతో కలిసి ఉంటున్నారు. నైనిక కూడా విజయ్ నటించిన 'తెరి' (తెలుగులో 'పోలీసోడు') చిత్రంలో బాలనటిగా కనిపించింది. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మీనా, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో ఆమె రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారన్న వార్తలు గుప్పుమన్నాయి. ముఖ్యంగా ఆమె బీజేపీలో చేరనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే, ఈ వార్తలపై మీనా వైపు నుంచి గానీ, బీజేపీ వర్గాల నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# పదవి త్యాగానికైనా రెడీ!

- దుబ్బాకకు సాగునీరు ఇచ్చేవరకు పోరాడుతా
- నీళ్లు ఇవ్వకుంటే.. అవసరమైతే రాజీనామా కూడా చేస్తా
- హైదరాబాద్ కు వెళ్లే మల్లన్న సాగర్ జలాలను అడ్డుకుంటాం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**దుబ్బాక, మహా:** దుబ్బాకకు నీళ్లు ఇవ్వకపోతే రాజీనామా చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ హయాంలో తాము ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఉప కాలువలు కూడా నిర్మించడం లేదని విమర్శించారు. ఏడాదిన్నర కాలంలో కాలువలు నిర్మించి నీళ్లు అందించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దుబ్బాక మండలంలోని పెద్ద గుండవెల్లి లో 'ఇర్కోడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీళ్ల కోసం జల సాధన సమితి' ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు మూలంగా తాము సర్వం కోల్పోయామని, మా కడుపు నింపిన తర్వాతే బయటకు నీళ్లు తీసుకెళ్లాలని, లేని పక్షం లో మల్లన్న సాగర్ వద్ద గోదావరి జలాలను అడ్డుకుంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మల్లన్న సాగర్ నిర్మాణం మూలంగా తమ గ్రామాలు కోల్పోవడంతో సర్వం కోల్పోయామన్నారు.ఇంత నష్టం జరిగినా మాకు నీళ్లు రాలేవన్నారు. ఇర్కోడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీళ్లు ఇవ్వడం తో పాటు, మా దగ్గర వెంటనే కాలువలు పూర్తి చేసి దుబ్బాక నియోజకవర్గ రైతంగానికి నీళ్లు ఇవ్వాలని లేని పక్షంలో హైదరాబాద్ వెళ్లే మల్లన్న సాగర్ నీళ్లను అడ్డుకుంటామన్నారు. తెలంగాణ ఉద్యమం తరహా మరో ఉద్యమం నిర్మిస్తామని ఆయన హెచ్చరించారు.

**నీళ్లు అందించడమే నా లక్ష్యం..**

యాసంగిలో నియోజకవర్గంలో ఉప్పర్ పల్లి, శంకరంపేట, రామాయంపేట, మల్లన్న సాగర్, సంగారెడ్డి కాలువలను కలియ తిరగడం జరిగిందన్నారు.నాకు వేరే పనేమీ లేదని కాలువల ద్వారా నీళ్లు అందించడమే నా లక్ష్యమన్నారు. ఈరోజు షిర్డీ వెళ్ళేది ఉన్నా రైతుల కన్నా పుణ్యకార్యం వేరేది లేదని రద్దు చేసుకుని రావడం జరిగిందన్నారు. పరాయి జిల్లా మంత్రులను ఇక్కడ ఇంచార్జి మంత్రులుగా ఉంటే మా సమస్యలు ఎలా తెలుస్తాయాన్నారు. కేసీఆర్ హయాంలో ఎత్తిపోతల కార్యక్రమం కు రూ. 111 కోట్లు మంజూరు అయ్యాయని, రూ. 92 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. ఏడాదిన్నరగా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని రైతులను పట్టించుకోవడం లేదన్నారు. తాను వ్యవసాయం చేశానని, మోట, గూడ కొట్టానని, డీజిల్ ఇంజిన్ ద్వారా సాగునీళ్లు అందించానని దుబ్బాక నియోజకవర్గం కు సాగు నీళ్లు అందించే వరకు నిద్రపోనని ఆయన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జల సాధన సమితి రైతులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. రంగనాయక సాగర్ లోని ఎంపీ రఘునందన్ రావుతో కలిసి ఎస్ ఈ కార్యాలయంలో ఎస్ ఈ బస్వరాజ్, మెగా ప్రాజెక్టు ఇంచార్జి ఎస్ ఎందుకు రెడ్డితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారుల, కాంట్రాక్టర్ ల నిర్లక్ష్యం పై మండి పడ్డారు. ఒక్కో గ్రామానికి అధికారి, కాంట్రాక్టర్ లను ఇంచార్జి గా ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు.

# అరవిందకు మళ్లీ పిలుపు

## ఈ రేస్ కేసులో ఏసీబీ నోటీసులు

- జులై 1న విచారణకు రావాలని ఆదేశాలు
- కొద్ది రోజులుగా విదేశాల్లోనే ఉంటున్న అరవింద్ కుమార్
- ఏసీబీ విచారణకు హాజరవుతారా.. లేదా అనేది ఉత్కంఠ



**హైదరాబాద్, మహా:** ఫార్ములా ఈ రేస్ కేసులో మరోసారి ఐఏఎస్ అరవింద్ కుమార్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే ఫార్ములా ఈ రేస్ కేసులో అరవింద్ కుమార్ పలు మార్లు ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆయన నుంచి ఏసీబీ అధికారులు ఈ కేసుకు సంబంధించి కీలక సమాచారాన్ని గతంలో రాబట్టారు. ఆయన స్టేట్‌మెంట్లను సైతం ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. తాజాగా మరోసారి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు.

**విదేశాల్లో అరవింద్ కుమార్..**

అయితే కొద్ది రోజుల పాటు సెలవు నిమిత్తం అరవింద్ కుమార్ విదేశాలకు వెళ్లారు. జూన్ 30వ తేదీన అరవింద్ కుమార్ సెలవు గడువు ముగుస్తుంది. తిరిగి ఆయన హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ నేపథ్యంలో జూలై 1న తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రెండుసార్లు విచారించిన ఏసీబీ, కేటీఆర్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా మరోసారి అరవింద్ కుమార్ ను విచారించాలని నిర్ణయించింది. గత విచారణలో భాగంగా అగ్రిమెంట్ల వ్యవహారం అంతా అప్పటి అధికారులు చూసుకున్నారని కేటీఆర్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు సమాచారం. దీంతో అప్పటి ఎంఏయుడి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న అరవింద్ కుమార్‌ను ఏసీబీ విచారణకు పిలవడం ప్రాముఖ్యత సంతరించుకుంది.

**కనిపించడం లేదని విమర్శలు..**

ఈ నేపథ్యంలోనే అరవింద్ కుమార్ కనిపించటం లేదంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. అయితే తాను ప్రభుత్వ అనుమతితోనే విదేశాలకు వెళ్లినట్లు ఒక జీవో సైతం బయటకు వచ్చింది. దాని ప్రకారం జూన్ 30 వరకు అరవింద్ కుమార్ సెలవుల్లో ఉండగా జూలై ఒకటో తారీఖున ఆయన విచారణకి హాజరుకానున్నారు. కాగా, ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ2 గా ఐఏఎస్ అరవింద్ కుమార్‌ను నిందితుడుగా ఏసీబీ చేర్చింది. అటు ఏసీబీ తోపాటు ఇటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల ముందు సైతం అరవింద్ కుమార్ హాజరయ్యారు.

## తెలంగాణ రైజింగ్ 2047

# దార్శనికతకు ప్రశంస

- ముఖ్యమంత్రి రేవంత్‌కి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ
- ఇటీవల ఢిల్లీలో రేవంత్‌తో టోనీ బ్లెయిర్ భేటీ
- పెట్టుబడులు, ఐటీ, ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలపై చర్చ
- టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్‌తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం
- తెలంగాణ విజన్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామన్న బ్లెయిర్




**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ అభినందనలు తెలుపుతూ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక ప్రణాళిక తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ బృహత్తర లక్ష్య సాధనకు తమవంతు సహకారం అందిస్తామని కూడా బ్లెయిర్ హామీ ఇచ్చారు. కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. ఆ భేటీ సందర్భంగా, తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' గురించి రేవంత్ రెడ్డి ఆయనకు వివరించారు. ముఖ్యంగా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం, ఐటీ రంగాన్ని మరింత విస్తరించడం, తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడం వంటి కీలక లక్ష్యాలపై వారి మధ్య చర్చ జరిగింది. ఈ చర్చల నేపథ్యంలోనే టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్ సంస్థకు, తెలంగాణ ప్రభుత్వానికి మధ్య ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' రూపకల్పన, దాని సమర్థవంతమైన అమలుకు సంబంధించి ఇరు పక్షాల ప్రతినిధులు ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కూడా మార్చుకున్నారు. తాజాగా, ఈ ఒప్పందం, చర్చల కొనసాగింపుగా టోనీ బ్లెయిర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికత పట్ల తన ప్రగాఢమైన అభినందనలు వ్యక్తం చేస్తూ, ఈ లక్ష్య సాధనలో తమ ఇన్‌స్టిట్యూట్ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను బ్లెయిర్ కొనియాడారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేస్తున్నాం.. గెలుస్తున్నాం

- సర్పంచ్ ఎన్నికలపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తాం
- ఫోన్ ట్యాప్ చేసే హక్కు కేసీఆర్, కేటీఆర్ కు ఎవరిచ్చారు?
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రైతుభరోసా విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా పదేళ్ల బీఆర్ఎస్ పాలన..ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని అన్నారు. అదేవిధంగా స్థానిక ఎన్నికల నిర్వహణ న్యాయస్థానం తీర్పుకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ పార్టీ చర్చించి నిర్ణయం ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ 18 నెలల పాలన గోల్డెన్ పిరియడ్ అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ నేతలు నోరు మెదపడం లేదని కామెంట్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికలు, జుబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీని సన్నద్ధం చేసేలా పలు కీలక నిర్ణయాలుతో పాటు ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహాలపై వరుస సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

**అన్యాయం జరిగితే ఊరుకోం..**

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేయడమే కాదు గెలిచేది కూడా తామేనని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ రైతు పక్షపాతి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకున్నామని తెలిపారు. తెలంగాణలో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో, జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమకు తిరుగు లేదన్నారు. మూడు ముక్కలాటతో బీఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం అయిందన్నారు. కవిత చెప్పినట్టు బీఆర్ఎస్‌లో దెయ్యాలుంటే.. కాంగ్రెస్‌లో దేవతలున్నారని కామెంట్ చేశారు. మహిళల అభివృద్ధి గురించి కవిత మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య..

కవితకు మద్దతు మాట్లాడటం విచారకరమని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వెలగబెట్టింది ఏమి లేదని.. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఫోన్ ట్యాపింగ్ చేశారని ఫైర్ అయ్యారు. దేశ చరిత్రలో అదో హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కేసులో ఎంతటి వారు ఉన్నా.. శిక్ష తప్పదని అన్నారు. కాళేశ్వరంతో పాటు పలు కుంభకోణాలను వెలుగుతీసి ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయపరంగా రావాల్సిన నిధులను, పథకాలను మంజూరు చేయకుండా వివక్ష చూపిస్తోందని అన్నారు. బనకచర్లతో రాష్ట్రానికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరకోబోమని.. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు కట్టుకోమని జీవోలు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో హరీశ్ రావు సంతకం ఎందుకు పెట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అభూత కల్పనతో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వ్యవస్థను నడుపుతున్నారని, వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

# దేశ చరిత్రలో ఒక చీకటి రోజు

## స్థానిక ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు

రెండు ఎకరాల రైతులకు కూడా రైతు భరోసా అందడం లేదు

ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ



**మహబూబ్నగర్, మహా :** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ధైర్యం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆమె ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమంపై గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రెండు ఎకరాల భూమి ఉన్న చిన్న రైతులకు కూడా రైతు భరోసా అందించడంలో విఫలమైందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు భరోసా పేరుతో సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని, ఇది కాంగ్రెస్ నేతలకే తెలియాలని ఆమె అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని, అందుకే ఎన్నికల నిర్వహణలో జాప్యం చేస్తోందని ఆరోపించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీజేపీ నాయకులందరూ బాధితులేనని డీకే అరుణ తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. అదే విధంగా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కూడా సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు కీలకమైన అంశాలపై సీబీఐ విచారణ కోరడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందో చెప్పాలని ఆమె నిలదీశారు. జూన్ 25వ తేదీ భారతదేశ చరిత్రలోనే ఒక చీకటి రోజని ఎంపీ అరుణ అభివర్ణించారు. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ పార్టీ దేశంలో చేసిన అరాచకాలు, ప్రజలపై సాగించిన దౌర్జన్యాల గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. నాడు పేదలపై అకృత్యాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ, నేడు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక న్యాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన సొంత అజెండాను దేశంపై రుద్దేందుకే గతంలో రాజ్యాంగ సవరణలు చేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడిచిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు రాజ్యాంగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ఆదరణ, కీర్తి ప్రతిష్టలను చూసి రాహుల్ గాంధీ ఓర్వలేకపోతున్నారని డీకే అరుణ ధ్వజమెత్తారు. "ఆపరేషన్ సిందూర్" ద్వారా భారతదేశ శక్తి సామర్థ్యాలను పాకిస్థాన్‌కు రుచి చూపించామని ఆమె గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీని విమర్శించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముందుగా ఎమర్జెన్సీ కాలం నాటి కాంగ్రెస్ దురాగతాల గురించి మాట్లాడాలని ఆమె హితవు పలికారు.



హైకోర్టు ఇచ్చిన గడువుకు ముందే

# బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ రిజర్వేషన్లు పెంచడానికి కోర్టు ఇచ్చిన సమయం చాలు
- బీసీ రిజర్వేషన్లు పెంచేదాకా కాంగ్రెస్, బిజెపిలను వదిలే ప్రసక్తే లేదు
- హైకోర్టు తీర్పుపై జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్,మహా :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30వ తేదీలోపు నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, బీసీ రిజర్వేషన్లు పెంచడానికి కోర్టు తీర్పు అడ్డంకిగా మారబోదని, బీసీ రిజర్వేషన్లు పెంచడానికి కావలసినంత సమయం కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం కల్పించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో హైకోర్టు తీర్పుపై స్పందించారు కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే, బీసీ రిజర్వేషన్ లను 42% పెంచడానికి నెలరోజుల సమయం సరిపోతుందని, ఇప్పటికైనా ఇరు పార్టీలు బీసీల విషయంలో రాజకీయాలు చేయకుండా చిత్తశుద్ధితో రేపటి నుండే రిజర్వేషన్ల పెంపు పై కార్యాచరణ మొదలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు

దేశంలో కులగనన చేస్తామని ప్రకటించిన బిజెపి, కులగనన చేసిన కాంగ్రెస్, బీసీ రిజర్వేషన్లు పెంచడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని బీసీలపై చిత్తశుద్ధి లేఖన? లేదంటే బీసీలను రాజకీయంగా అణిచివేయాలనే ఆలోచన ఆ పార్టీలకు కలుగుతుందా అని అనే అనుమానం బీసీలలో నెలకొన్నదని ఆయన అన్నారు బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచకుండా ఎన్నికలకు వెళితే బీసీలు ఎట్టి పరిస్థితుల్లో సహించరని, ఇది ఆయా రాజకీయ పార్టీలు గ్రహిస్తే మంచిదని ఆయన హెచ్చరించారు బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదేనని, దీనికి 100 శాతం కాంగ్రెస్, బిజెపిలే బాధ్యత వహించాలని రిజర్వేషన్లు పెంచే వరకు కాంగ్రెస్, బిజెపి పార్టీల వెంటపడతామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు

# ఏడాదికి రెండుసార్లు 'పది' పరీక్షలు

- పరీక్షా విధానంలో మార్పులకు సీబీఎస్ఈ ఆమోదం
- వచ్చే ఏడాది నుంచే నిర్వహించనున్నట్లు ప్రకటన
- ఫిబ్రవరిలో, మే నెలలో పరీక్షలు ఉంటాయని వెల్లడి
- ఫిబ్రవరిలో పరీక్షలకు తప్పనిసరి హాజరు.. మేలో ఆప్షనల్

**ఢిల్లీ, మహా:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కీలక నిర్ణయం తీసుకుంది. 2026 నుంచి సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలు ఏడాదిలో రెండుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. మొదటి విడత పరీక్షలు ఫిబ్రవరిలో ఉంటాయి. ఈ పరీక్షలకు విద్యార్థులంతా తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. ఇక రెండో విడత పరీక్షలు మే లో ఉంటాయి. ఇది ఐచ్ఛికం. తమ పెర్ఫారమెన్స్ పెంచుకోవాలని ఆశించే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇంటర్నల్ అసెస్‌మెంట్ మాత్రం అకడమిక్ సెషన్‌లో ఒకేసారి ఉంటుంది.

**ఫిబ్రవరిలో తప్పనిసరి, మే లో ఆప్షనల్..**

అయితే, ఫిబ్రవరిలో జరిగే మొదటి దశ పరీక్షలకు హాజరుకావడం తప్పనిసరి అని అధికారులు తెలిపారు. మేలో జరగనున్న రెండో దశ పరీక్షలు తమ మార్కులను మెరుగుపరుచుకోవాలనుకునే విద్యార్థులకు ఐచ్ఛికంగా ఉంటుందని వారు తెలిపారు. మొదటి దశ ఫిబ్రవరిలో, రెండో దశ మేలో నిర్వహిస్తామని సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యం భరద్వాజ్ తెలిపారు. రెండు దశల ఫలితాలను వరుసగా ఏప్రిల్, జూన్‌లో ప్రకటిస్తామని తెలిపారు. మొదటి దశ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, రెండో దశ ఐచ్ఛికంగా ఉంటుందని తెలిపారు.

**ఏవైనా మూడు సబ్జెక్టుల్లో..**

సైన్స్, మ్యాథమెటిక్స్, సోషల్ సైన్స్, లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో ఏదైనా మూడు సబ్జెక్టుల్లో విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకోవచ్చు. ఆమోదించిన నిబంధనల ప్రకారం, వింటర్ బౌండ్ స్కూల్స్ కు చెందిన 10 వ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి లేదా మే లలో రెండు దశలలో ఏదైనా బోర్డు పరీక్షకు హాజరయ్యే అవకాశం లభిస్తుంది. ఈ గ్రేడ్ తరగతికి అంతర్గత మూల్యాంకనం (ఇంటర్నల్స్) ఒక విద్యా సంవత్సరంలో ఒకసారి మాత్రమే జరుగుతుంది. ఫిబ్రవరిలో సీబీఎస్ఈ ప్రకటించిన ముసాయిదా నిబంధనలను ప్రజల అభిప్రాయాల కోసం పబ్లిక్ డొమైన్‌లో అప్లోడ్ చేశారు.

# సమాజం ఎక్కడ పోతోంది?

- కో-లివింగ్ హాస్టళ్లపై చర్యలు తీసుకోండి
- ఒకప్పుడు ఫ్యాక్షన్ మర్డర్స్ జరిగేవి.. ఇప్పుడు లవ్ మర్డర్స్
- కాంగ్రెస్ సీనియర్ నేత వీ హన్మంతరావు హాట్ కామెంట్స్



**హైదరాబాద్, మహా:** హైటెక్ నగరంలో కోలివింగ్ హాస్టళ్లతో అనర్థమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీ హన్మంతరావు అన్నారు. ఈ కోలివింగ్ హాస్టల్స్ సంస్కృతిని ఆపాలని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబును ఆయన కోరారు. ఒకే హాస్టల్‌లో ఆడ పిల్లలు, మగ పిల్లలు కలిసి ఉంటున్నారని.. ఇది మంచి సంస్కృతి కాదని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నెంబర్‌వన్ సిటీ కావాలంటే ఇలాంటి వాటిని కట్టడి చేయాలని వీహెచ్ అభిప్రాయపడ్డారు. ఎన్ ఎస్ యూ ఐ విద్యార్థి సంఘం కూడా వీటి మీద దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో ఫ్యాక్షన్ మర్డర్స్ ఉండేవని, ఇప్పుడు సొంత భర్తను భార్య చంపడం, కూతురు తల్లిని చంపడం లాంటివి జరుగుతున్నాయని, ఇది దారుణమని అన్నారు.

**వాళ్లు ఎందుకు మాట్లాడటం లేదు..**

ఇప్పుడు లవ్ మర్డర్స్ జరుతున్నాయని, ఇలాంటి వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దని వీహెచ్ రిక్వెస్ట్ చేశారు. ఇవన్నీ చూస్తుంటే సమాజం ఎటువైపు పోతోందని భయమేస్తుందని అన్నారు. హ్యూమన్ రైట్స్ వాళ్లు నక్సలైట్ల హత్యల విషయంలో మాట్లాడుతారని, లవ్ మర్డర్స్‌పై వాళ్లు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఇలాంటి మర్డర్స్‌ను కూడా మానవ హక్కుల సంఘాలు పరిగణలోకి తీసుకోవాలని వీహెచ్ సూచించారు. సైకాలజిస్టులు, ఇంటలెక్చువల్స్ కూడా ఆలోచన చేయాలని అన్నారు. నిత్యం ఎక్కడో ఒక తప్పు జరుగుతూనే ఉందని, సావిత్రీభాయ్ పూలేను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.


# నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి
- అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలో పలు గ్రామల్లో రూ.1.43 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**అబ్దుల్లాపూర్మెట్,మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని అబ్దుల్లాపూర్, కవాడిపల్లి, బండరావిరాల, చిన్నరావిరాల, బాటసింగారం, జఫర్గూడ, ఇనాంగూడ, లష్కర్గూడ గ్రామాల్లో బుధవారం స్థానిక నాయకులతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అన్నిగ్రామాల్లో ప్రగతికి బాటలు వేస్తామన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెవడానికి కృషి చేస్తానని అన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించేలా సీఎం రేవంత్‌రెడ్డి కోరుతానని తెలిపారు. రానున్న మూడున్నర ఏండ్లలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వెల్లడించారు. గడిచిన పదేండ్లలో గత ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. ఆ అప్పులను తీర్చుకుంటూ.. ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇంటి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రాజీవ్ యువ వికాస్ ద్వారా నిరుపేద యువతకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. పేదల సంక్షేమానికి సీఎం రేవంత్ పెద్దపీత వేస్తున్నారన్నారు.

# బనకచర్లపై న్యాయ పోరాటం

- తెలంగాణ వాదన బలంగా వినిపిద్దాం
- రోడ్ మ్యాప్ ను సిద్ధం చేయాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- 30న ప్రజాభవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్



**హైదరాబాద్, మహా:** గోదావరిబనకచర్ల లింక్ ప్రాజెక్టును ఆపడానికి తెలంగాణ ప్రభుత్వం చట్టపరమైన చర్యలతో ముందుకు సాగుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం జలసౌధలో ఉన్నత నీటిపారుదల అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బనకచర్ల ప్రాజెక్టు చట్టవిరుద్ధమైనదని, రాష్ట్ర ప్రయోజనాలకు హానికరం అని అన్నారు. ఈ ప్రాజెక్టును సవాల్ చేయడానికి, తెలంగాణ వాదన బలంగా వినిపించేందుకు చట్టపరమైన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. తెలంగాణ నీటిపారుదల పనుల కోసం ఆర్మీ టన్నెల్ నిపుణులను నియమించనున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ విషయంలో ఈ నెల 18వ తేదీనే అఖిలపక్ష పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా మరోసారి పీపీటీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించబోతున్నట్లు మంత్రి ఉత్తమ్ తాజాగా వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తాజా పరిణామాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మంత్రులతో సంప్రదింపులు, చేస్తున్న పోరాటం వివరాలను ఈ పీపీటీలో వివరించనున్నారు.

**వారానికోసారి నివేదిక అందించాలి..**

ముఖ్యంగా గత బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాజెక్ట్ కు ఎలా అంకురార్పణ జరిగిందో స్పష్టమైన డాక్యుమెంట్ల ఆధారాలు చూపడంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రస్తుత చర్య వెనుక ఉన్న రాజకీయ నేపథ్యాన్ని బహిర్గతం చేసేలా ఈ పీపీటీ ఉండనుందని చెప్పారు. అలాగే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఎన్డీఎస్ఏ సిఫార్సుల అమల్లో ఆలస్యం తగదని కేంద్ర జలసంఘం మార్గదర్శకాల మేరకు మరమ్మతులు చేయాలని పనుల పురోగతి నివేదికలను వారానికోసారి అందించాలని అధికారులను ఆదేశించారు. సింగూర్ కెనాల్‌తో సహా ఇతర ప్రధాన పనుల స్థితిని కూడా ఈ సందర్భంగా మంత్రి సమీక్షించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టుపై ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలతో సహా అనేక ఏజెన్సీల నుంచి ప్రతిపాదనలు కోరినట్లు అధికారులు మంత్రికి తెలియజేశారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు అదనపు మానవశక్తి నియమించాలని లైడార్ సర్వే నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, బదిలీలపై తక్షణ చర్య తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పదోన్నతులు, బదిలీలను ఆలస్యం చేయకుండా పూర్తి చేస్తామని మంత్రి అధికారులకు తెలిపారు.




## ప్రశాంత్ కిషోర్ పార్టీకి ఎన్నికల గుర్తుగా స్కూల్ బ్యాగ్

**మహా:** ఎన్నికల కమిషన్ జన్ సూరజ్ పార్టీకి ఎన్నికల గుర్తును కేటాయించింది. ప్రశాంత్ కిషోర్ పార్టీకి కమిషన్ 'స్కూల్ బ్యాగ్' ఎన్నికల గుర్తును ఇచ్చింది. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు భారత ఎన్నికల సంఘం అధికారికంగా జన్ సూరజ్ పార్టీకి ఎన్నికల గుర్తు "స్కూల్ బ్యాగ్"ను కేటాయించింది. బీహార్‌లోని 243 సీట్లలో జన్ సూరజ్ పార్టీ అభ్యర్థులు ఈ గుర్తుపై పోటీ చేయనున్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం పట్ల పార్టీ నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణాత్మక విధానం, సమ్మిళిత అభివృద్ధి ద్వారా సంస్కరణ, సామాజిక అభ్యున్నతిని తీసుకురావాలనే లక్ష్యంతో ఈ చిహ్నం ప్రతిధ్వనిస్తుందని పేర్కొన్నారు. బీహార్‌లో మార్పుకు నాంది పలికాలని జాన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ విద్య, ఉపాధిపై దృష్టి పెట్టారు.

# బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే

- పార్టీలు అమలు చేయాలనడం బీసీలను మోసం చేయడమే
- స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్



**న్యూఢిల్లీ, మహా :** హైకోర్టు తీర్పు మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను రేవంత్ ప్రభుత్వం నిర్వహించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కోరారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర సర్కార్ చోద్యం చూస్తోందని విమర్శించారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, సర్పంచ్‌ల బిల్లులను ప్రభుత్వం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేశారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేస్తూ ఇచ్చిన మాట ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీల పరంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రేవంత్‌రెడ్డి అనడం బీసీలను మోసం చేయడమేనని విమర్శించారు. కులగణన పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. తూతూమంత్రంగా బీసీ కులగణన చేశారని ఆరోపించారు. హైదరాబాద్ లో 40 శాతం బీసీ కులగణన జరగలేదని రేవంత్ ప్రభుత్వం చెబుతోందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే పరిశీలిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 2 వేల కోట్ల నిధులు ఆగిపోయాయని, తద్వారా గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. కులగణనలో 90 శాతం ముస్లింలను బీసీల్లో చేర్చి, నిజమైన బీసీలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు అమ్మకుండా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల భూములను వెనక్కి అడుగుతున్న తెలంగాణ ప్రభుత్వం వాటిని అమ్మాలని భావిస్తుందా అని నిలదీశారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వం భూముల అమ్మకాన్ని మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ భూముల అమ్మకాన్ని అడ్డుకొని తీరుతామని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ హెచ్చరించారు. కాళేశ్వరం కమిషన్ సీరియల్‌గా నడుస్తోందని ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తి అయిందని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ తాను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి జరిగి ఉండొచ్చని.. తాను అప్పుడు పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. ఫార్ములా ఈ రేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులు ఏడాది కాలం నుంచి సాగదీస్తున్నారని విమర్శించారు. అసలు ఈ కేసులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా అని ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఈ ఫార్ములా రేస్ కేసులను సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

EDITORIAL సంపాదకీయం

# ట్రంప్ అంత ఈజీ కాదు


నోబెల్‌పై తన ఆకాంక్షను అమెరికా అధ్యక్షుడు ఇప్పటికే చాలా సార్లు బయటపెట్టారు. ప్రపంచ శాంతిని కోరుకుంటున్న తనకు ఇచ్చి తీరాల్సిందేనంటున్నారు. ''నాకు ఇప్పటికే నాలుగైదు సార్లు ఈ పురస్కారం రావాల్సింది. కానీ వాళ్లు నాకు ఇవ్వరు. కేవలం లిబరల్స్‌కు మాత్రమే ఇస్తారు (నోబెల్ శాంతి పురస్కారం అందుకున్న డెమోక్రటిక్ నేతలను ఉద్దేశిస్తూ) అని ఓసారి ట్రంప్ మీడియాతో అన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు 2009లో ఈ పురస్కారం లభించిన సంగతి తెలిసిందే. మరో నలుగురు మాజీ అధ్యక్షులు కూడా ఈ అవార్డును అందుకున్నారు. ''భారత్‌పాక్ యుద్ధాన్ని ఆపాను. రష్యాఉక్రెయిన్ మధ్య శాంతిని ప్రతిపాదించాను. రవాండా, కాంగో ఘర్షణలు తగ్గించాను. ఇన్ని చేసినా వారు నాకు నోబెల్ ఇవ్వరు'' అని ఇటీవల ట్రంప్ మరో పోస్ట్‌లో తన అసహనాన్ని వ్యక్తం చేశారు.

దీంతో నోబెల్ బహుమతిపై ట్రంప్ ఆశ నెట్టింట చర్చకు తెరలేపింది. అంతేకాదు.. ఇటీవల జీ7 సదస్సును అర్ధంతరంగా ముగించుకుని ట్రంప్ వెళ్లిపోయిన సందర్భంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఆయన ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య శాంతి కుదిర్చేందుకు వెళ్లారంటూ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయితే, ఈ బహుమతికి ట్రంప్ నామినేట్ అవడం కొత్తేం కాదు. గతంలోనూ 2018, 2020, 2021లో ఆయన పేరును కొంతమంది నామినేట్ చేశారు. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉద్రిక్తతల నివారణకు ప్రయత్నాలు, సెర్బియాకొసావో మధ్య ఆయన చేసిన ఆర్థిక ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ ట్రంప్ పేరును ప్రతిపాదించారు.

### 'శాంతి పురస్కారం' ఎలా ఇస్తారు?

అవార్డు ప్రకటించడానికి ముందు ఏడాదిని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కార విజేతను ఎంపిక చేస్తారు. దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించేలా చేసిన ప్రయత్నాలు, సాయుధ దళాలను తక్కువగా వినియోగించడం, శాంతి కోసం కృషి చేసిన వారికి ఈ ప్రైజ్ ఇవ్వాలని ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియ కోసం నార్వే పార్లమెంట్.. ఓ నోబెల్ కమిటీనీ నియమిస్తుంది. ఏటా అర్హులైన వ్యక్తులు ఈ పురస్కారం కోసం కొందరి పేర్లను ప్రతిపాదించొచ్చు. నామినేట్ చేసేందుకు కూడా కొన్ని అర్హతలను నిర్ణయించారు.

- జాతీయ అసెంబ్లీల సభ్యులు, ఇంటర్‌పార్లమెంటరీ యూనియన్ సభ్యులు నామినేట్ చేయొచ్చు. పర్మనెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ సభ్యులు, హేగ్‌లోని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ సభ్యులు కూడా ప్రతిపాదనలు చేస్తారు. పలు రంగాల్లో విద్యావేత్తలు, నార్వే నోబెల్ కమిటీ ప్రస్తుత, మాజీ సభ్యులు, నార్వే నోబెల్ ఇనిస్టిట్యూట్ శాశ్వత సలహాదారులు తమకు నచ్చిన వారిని నామినేట్ చేయొచ్చు.
- అవార్డు గ్రహీతను ఎవరు నామినేట్ చేశారన్న విషయాన్ని కమిటీ అత్యంత రహస్యంగా ఉంచుతుంది. దాదాపు 50 ఏళ్ల పాటు ఆ విషయాన్ని బయటపెట్టదు.
- శాంతి పురస్కారం కోసం 2011లో అత్యధికంగా 241 నామినేషన్లు వచ్చాయి. అంతకుముందు 2010లో 237, 2009లో 205 నామినేషన్లు అందాయి.
- ఈ నామినేషన్లను నోబెల్ కమిటీ షార్ట్ లిస్ట్ చేసి తదుపరి రివ్యూకు పంపిస్తుంది. నోబెల్ ఇనిస్టిట్యూట్ శాశ్వత సలహాదారులు దీన్ని పరిశీలించి తుది జాబితాను సిద్ధం చేస్తారు.
- సాధారణంగా ఇందుకోసం కొన్ని నెలల సమయం తీసుకుంటారు. ఏకాభిప్రాయానికి వచ్చేంతవరకు అనేక సార్లు సమావేశాలు నిర్వహిస్తారు. వాస్తవానికి సెప్టెంబరు మధ్యలో దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఒక్కోసారి చివరి నిమిషం వరకు గ్రహీత ఎవరనేదానిపై నిర్ణయానికి రాలేరు. అక్టోబరులో అవార్డును ప్రకటించడానికి ముందు నిర్వహించే చివరి సమావేశంలో విజేత పేరును ఖరారు చేస్తుంటారు.
- నోబెల్ వర్ధంతిని పురస్కరించుకుని ఏటా డిసెంబరు 10న ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఇతర రంగాల్లో ఇచ్చే నోబెల్ బహుమతులను స్టాక్‌హోమ్‌లో గ్రహీతలకు ప్రదానం చేస్తుండగా.. ఈ శాంతి పురస్కారాన్ని మాత్రం ఓస్లో సిటీ హాల్‌లో అందజేస్తారు.





# రూటుమార్చిన ఈసీ

**ఈ ఏడాది చివరికల్లా తమిళనాడు, బెంగాల్, కేరళ, పుదుచ్చేరి, అసోంలలోనూ రివ్యూ**

**మహా:** విపక్షాల విమర్శల నేపథ్యంలో బిహార్‌తో పాటు మరో ఐదు రాష్ట్రాల్లో ఓటరు జాబితాలను సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) రెడీ అవుతోంది. ఈ ఏడాది అక్టోబరు నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో వెంటనే ఓటరు జాబితాల సమీక్షను మొదలుపెట్టనుంది. చివరిసారిగా 2003లో బిహార్‌లో ఓటరు జాబితాలను సమీక్షించారు. అంటే 22 ఏళ్ల సుదీర్ఘ సమయం తర్వాత అక్కడ ఈ ప్రక్షాళన ప్రక్రియ మళ్లీ జరగబోతోంది. ఇక 2026 మేజూన్‌లో పోల్స్ జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరి, అసోంలలో ఈ ఏడాది చివరికల్లా ఈ ప్రక్రియను ప్రారంభిస్తామని ఈసీ అధికార వర్గాలు తెలిపాయి. దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో ముడిపడిన ఓటరు జాబితాల సమగ్రతను పరిరక్షించేందుకే వాటిని తాము సమీక్షిస్తున్నట్లు వెల్లడించాయి. ఇందులో భాగంగా ఓటరు జాబితాల్లో పేర్లున్న వారి సమాచారాన్ని వేరిఫై చేసేందుకు ఆయా రాష్ట్రాల్లో బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని ఈసీ అధికారులు తెలిపారు.

**అక్రమ ఓట్లకు చెక్**

ఓటరు జాబితాల సమీక్షలో భాగంగా వాటి నుంచి విదేశీ అక్రమ వలసదారుల పేర్లను తొలగించనున్నారు. ఓ రాష్ట్రానికి చెందిన వారు మరో రాష్ట్రంలో ఓటుకు దరఖాస్తు చేసుకుంటే వారి నుంచి అదనంగా ఒక డిక్లరేషన్ ఫామ్‌ను తీసుకుంటున్నారు. ఈ ఫామ్‌లో రెండు ఆప్షన్లు ఉంటాయి. 1987 జులై 1 కంటే ముందే భారత్‌లో జన్మించిన వారి కోసం ఒక ఆప్షన్, 1987 జులై 1 నుంచి 2004 డిసెంబరు 2 మధ్య భారత్‌లో జన్మించిన వారి కోసం మరో ఆప్షన్ ఉంటాయి. దరఖాస్తుదారులు వారికి వర్తించే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. 1987 జులై 1 కంటే ముందే భారత్‌లో జన్మించిన వారు తప్పకుండా పుట్టిన తేదీ లేదా పుట్టిన ప్రదేశానికి సంబంధించిన డాక్యుమెంట్‌ను సమర్పించాలి. 1987 జులై 1 నుంచి 2004 డిసెంబరు 2 మధ్య జన్మించిన వారు అదనంగా తమ తల్లిదండ్రుల పుట్టిన తేదీ లేదా పుట్టిన ప్రదేశం డాక్యుమెంట్లనూ ఇవ్వాల్సి ఉంటుంది.




**ఈ కారణాల వల్లే ఓటరు జాబితాల సమీక్ష**

ఓటరు జాబితాలను సమీక్షించే క్రమంలో రాజ్యాంగ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటామని ఈసీ వెల్లడించింది. అర్హులైన ఓటర్ల కొనసాగింపు, అనర్హులైన వారి పేర్ల తొలగింపు అన్నీ చట్టప్రకారమే జరుగుతాయని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, 1950 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16లో దీనికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తుచేసింది. ప్రధానంగా 5 కారణాల వల్ల తాము ఓటరు జాబితాలను సమీక్షిస్తున్నామని ఈసీ అధికార వర్గాలు తెలిపాయి.

వేగవంతమైన పట్టణీకరణ, పెరిగిపోయిన వలసలు, కొత్త ఓటర్లు పెరుగుతుండటం, ఓటర్ల మరణాల సమాచారం అప్‌డేట్ కాకపోవడం, విదేశీ అక్రమ వలసదారులకూ ఓట్లు ఉండటం వంటి అంశాల వల్లే ఓటరు జాబితాల సమీక్షను చేపట్టామని పేర్కొన్నాయి. తప్పులకు తావు లేని ఓటరు జాబితాలకు రూపకల్పన చేసి, వాటి సమగ్రతను కాపాడుతామని ఈసీ స్పష్టం చేసింది. కాగా, బీజేపీకి సాయం చేసేందుకే ఓటరు జాబితాల అంశంపై ఈసీ నోరువిప్పడం లేదని గతంలో పలు విపక్ష పార్టీలు విమర్శించాయి. వాటిని ఎప్పటికప్పుడు ఈసీ ఖండించింది.

# నోబెల్.. ఇయ్యాల్సిందే

## నోబెల్ శాంతి బహుమతి కోసం.. ట్రంప్ పేరు నామినేట్



**మహా :** తనలో శాంతిదూతను చూస్తున్నాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ప్రపంచమంతా తనలోని ఈ కోణాన్ని చూడాలని ఆయన కోరుకుంటున్నారు. నోబెల్ శాంతి బహుమతి పొందాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్ష రోజురోజుకు తీవ్రమవుతోంది. తాజాగా ఆయన పేరును అధికారికంగా నామినేట్ చేశారు. అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డీ కార్టర్ ఈ మేరకు నార్వేలోని నోబెల్ కమిటీకి ఓ లేఖను పంపించారు.

''అసాధ్యమనుకొన్న సంక్షోభాల్లో కూడా వేగంగా ఒప్పందాలు చేయించడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించారు. ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదర్చడంలో చరిత్రాత్మక పాత్ర పోషించారు. దీంతోపాటు ప్రపంచంలోనే ఉగ్రవాదులను పోషించే అతిపెద్ద దేశానికి అత్యంత వినాశకర ఆయుధం అందకుండా చేశారు. ఆయన నాయకత్వాన్ని నోబెల్ ప్రైజ్‌తో గుర్తించాలి'' అని కోరారు. ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య 12 రోజుల నుంచి జరుగుతున్న యుద్ధాన్ని ఆపుతూ ఆయన ఒప్పందం కుదిర్చారు.

సాధారణంగా నోబెల్ శాంతి బహుమతికి ఆయా దేశాల జాతీయ పార్లమెంట్ సభ్యులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, ఇతరులు నామినేషన్లను సమర్పించవచ్చు. మరోవైపు నోబెల్ శాంతి బహుమతి తనను వరించకపోవచ్చని ఇటీవల కాలంలో ట్రంప్ తీవ్ర నిరాశ వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు చేస్తూ ''నేను ఏం చేసినా.. నాకు నోబెల్ ప్రైజ్ రాదు. భారత్‌పాక్ మధ్య యుద్ధం ఆపినా.. సెర్బియా కొసావో మధ్య పోరాటాన్ని నిలిపినా తనకు మాత్రం బహుమతి లభించదు'' అని విచారం వ్యక్తం చేశారు.

**ప్రతిపాదన విరమించుకొన్న ఉక్రెయిన్ సభ్యుడు**

ట్రంప్ పేరును ఉక్రెయిన్‌కు చెందిన చట్టసభ సభ్యుడు ఒలెక్సాండర్ మెరెఝ్కో కూడా నోబెల్‌కు ప్రతిపాదించారు. కానీ, అమెరికా అధ్యక్షుడు రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడంలో విఫలం కావడంతో ఇప్పుడు తాజాగా ఆ నామినేషన్‌ను ఉపసంహరించుకొంటున్నట్లు ప్రకటించారు. తనకు ట్రంప్‌పై నమ్మకం పోయిందని ఆయన ఈసందర్భంగా వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో ఉక్రెయిన్‌రష్యా యుద్ధాన్ని ఆపుతానని ఎన్నికల వేళ ట్రంప్ హామీ ఇచ్చారు. ఆయన ప్రతిపాదించిన శాంతి ఒప్పందాన్ని ఉక్రెయిన్ అంగీకరించినా.. రష్యా ఒప్పుకోలేదు.

## పాక్‌కు షాక్

**ఇటీవల ట్రంప్ పేరును పాకిస్థాన్ ప్రభుత్వం నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ చేసింది. ఆ మర్నాడే ఆయన ఇరాన్‌పై బంకర్ బస్టర్ బాంబులతో దాడులు చేయించారు. ఈ పరిణామాలతో ఒక్కసారిగా పాక్ షాక్‌కు గురైంది. తమ పొరుగుదేశం పైనే ట్రంప్ విరుచుకుపడటంతో ఏం చేయాలో పాలుపోలేదు. చివరికి పాక్ ప్రతిపక్షాలు ఆ ప్రభుత్వాన్ని తప్పుపట్టాయి. నోబెల్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఇక భారత్ కూడా పాక్‌తో ఘర్షణను ట్రంప్ ఆపలేదని పలుమార్లు తేల్చిచెప్పింది.**

# కుర్చీకే అతుక్కుపోయే ఉద్యోగాలు కాలేయాన్ని దెబ్బతీస్తాయి

**గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ హెచ్చరిక**

ఆధునిక పని సంస్కృతి... మన కాలేయాన్ని నిశ్శబ్దంగా దెబ్బతీస్తోందట. అవును, వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఆధునిక కార్యాలయాల్లో పెరిగిపోతున్న ఒత్తిడి, ఎక్కువసేపు కూర్చోవడం, సరిగ్గా లేని అలవాట్లు... ఇవన్నీ కాలేయ సమస్యలను ఎలా పెంచుతున్నాయో ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ వివరించారు. ఈ రోజుల్లో వేగంగా దూసుకుపోతున్న ఉద్యోగ ప్రపంచంలో, ఆధునిక పని సంస్కృతి మన కాలేయ ఆరోగ్యంపై చాలా మంది ఊహించని విధంగా ప్రభావం చూపుతోంది. గంటల తరబడి డెస్క్ ముందు కూర్చోవడం, తీవ్రమైన ఒత్తిడి, సమయానికి తినకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం... ఇవన్నీ నిశ్శబ్దంగా 'నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్' పెరగడానికి కారణమవుతున్నాయి. ఇప్పుడు ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణ కాలేయ వ్యాధులలో ఒకటిగా మారింది.

**జీవనశైలి అలవాట్లు కాలేయాన్ని ఎలా పాడుచేస్తాయి?**

పుణెలోని రూబీ హాల్ క్లినిక్ లో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, జీఐ ఎండోస్కోపిస్ట్ అయిన డాక్టర్ నరేంద్ర చోప్డే, HT లైఫ్‌స్టైల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలు వెల్లడించారు. "ఒక చోట ఎక్కువసేపు కూర్చుండిపోయే జీవనశైలి, ముఖ్యంగా కార్పొరేట్ ఉద్యోగాలలో, అలాగే ఇంటి నుంచి పనిచేసే వారికి పెద్ద ప్రమాదకరమైన అంశం" అని ఆయన వివరించారు. "గంటల తరబడి కూర్చోవడం వల్ల జీవక్రియ మందగిస్తుంది. కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. మామూలు బరువు ఉన్నవారికి కూడా ఇదే జరుగుతుంది." అని హెచ్చరించారు. "ఈ పరిస్థితిని 'లీన్ ఎన్ఏఎఫ్ఎల్‌డీ' అంటారు. బయట చూడటానికి ఆరోగ్యంగా కనిపించినా, లోపల జీవక్రియ పరంగా ప్రమాదంలో ఉన్న పట్టణ నిపుణులలో ఇది పెరుగుతోంది" అని ఆయన వివరించారు. "సమయానికి తినకపోవడం, ప్యాక్ చేసిన ఆహారాలు, తరచుగా బయటి ఫుడ్ తినడం, చక్కెర పానీయాలు, భోజనం దాటవేయడం వంటి అలవాట్లు కాలేయంపై మరింత ఒత్తిడిని పెంచుతాయి. దీనికితోడు, పని వల్ల కలిగే అధిక ఒత్తిడి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఇన్సులిన్ సున్నితత్వాన్ని తగ్గిస్తుంది. కాలేయ కణాలలో కొవ్వు పేరుకుపోవడానికి దోహదపడుతుంది. కాలక్రమేణా, ఇది మంటకు (ఇన్‌ఫ్లమేషన్), ఫైబ్రోసిస్‌కు, చివరకు సిర్రోసిస్‌కు కూడా దారితీయవచ్చు" అని ఆయన హెచ్చరించారు.

**ముందస్తు గుర్తింపు, నివారణ ఎందుకు ముఖ్యం?**

"క్రమరహిత నిద్ర, తరచుగా నొప్పి నివారణ మందులు, యాంటాసిడ్‌లు వంటి ఓవర్‌దికౌంటర్ మందుల వాడకం కాలేయ పనితీరుపై మరింత భారాన్ని



పెంచుతాయి" అని డాక్టర్ నరేంద్ర చోప్డే వివరించారు. "కాలేయ సంబంధిత సమస్యల విషయంలో అసలు సవాల్ ఏమిటంటే, అవి తరచుగా నిశ్శబ్దంగానే పెరుగుతాయి. చాలా మందికి నష్టం ముదిరే వరకు అసలు తెలియదు.." అని ఆయన అన్నారు. "అందుకే, లివర్ ఫంక్షన్ టెస్ట్‌లు, ఫైబ్రోస్కాన్ వంటి సాధనాల ద్వారా నిరంతర స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు చాలా ముఖ్యమైనవి." అని సూచించారు. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని జాగ్రత్తలను పాటించాలని డాక్టర్ చోప్డే సిఫార్సు చేస్తున్నారు. "క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం, ఆహారంపై శ్రద్ధ పెట్టడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరిపడా నిద్రపోవడం, కాలానుగుణంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యాన్ని బాగా కాపాడుకోవచ్చు. మన పని సంస్కృతి మారుతున్న కొద్దీ, మన వ్యక్తిగత ఆరోగ్య విధానాలు కూడా మారాలి. ఆధునిక పని ప్రపంచంలో కాలేయ ఆరోగ్యం ఒక ముఖ్యమైన ప్రాధాన్యత." అని వివరించారు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

# బీజేపీ, కాంగ్రెస్‌లు కార్పొరేట్ల గులాములే

## సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్




**ఆదిలాబాద్, మహా:** ఎమర్జెన్సీ ఒక చీకటి రోజని, నాటి ఇందిరాగాంధీ నిరంకుశ పోకడలకు నిలువెత్తు నిదర్శనం అని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు . బుధవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఎమర్జెన్సీ పై నిర్వహించిన సెమినార్ లో అయన మాట్లాడారు. ఎమర్జెన్సీ విధించి పత్రిక స్వేచ్ఛను కాలరాశారని, ప్రజాస్వామిక వాదులు, పోరాట యోధులను జైలుకు పంపించారని గుర్తు చేశారు. కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూల్చి అప్రజాస్వామికంగా వ్యవహరించారన్నారని మండిపడ్డారు. బెంగాల్ లో సీపీఎంపై, ఆ రాష్ట్ర ప్రజలపైన అర్ధఫాసిస్టు బీభత్సకాండను ప్రయోగించిందని తెలిపారు. నాడు ఎమర్జెన్సీని,ఆర్ఎస్ఎస్ బలపర్చి ఇందిరా గాంధీ పంచన చేరిందన్నారు. తాజాగా బీజేపీ ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తున్నట్టు నటిస్తోందని ఎద్దేవా చేశారు. నాడు ప్రకటిత ఎమర్జెన్సీ అయితే నేటి బీజేపీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని తెలిపారు. పౌరహక్కులు కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ కాగార్ పేరుతో మావోయిస్టులను చంపుతున్నారని, ఉపా లాంటి చట్టాలను ప్రయోగించి ప్రశ్నించిన వారిని జైళ్లకు పంపుతున్నారని పేర్కొన్నారు. గవర్నర్ల పేరుతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించి వేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను కాలరాసి నాలుగు కోడ్ లను తెచ్చి కార్పొరేట్ సంస్థల దోపిడీకి ద్వారాలు తెరిచారని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు ,పూసం సచిన్ ,సీనియర్ నాయకులు బండి దత్తాత్రి ,జిల్లా కమిటీ సభ్యులు ఆర్ .మంజుల, నాయకులు కె .ఆశన్న, గంగా సాగర్,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాకు మంత్రుల రాక

- పలు అభివృద్ధి పనులకు అంకురార్పణ
- ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమైన కాంగ్రెస్ శ్రేణులు
- బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కంది శ్రీనివాస రెడ్డి పిలుపు

**ఆదిలాబాద్, మహా** ఆదిలాబాద్ జిల్లాకు ఇద్దరు రాష్ట్ర మంత్రులు రానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లాకు చెందిన కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మంత్రుల హోదాలో గురువారం తొలిసారి ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పలు అభివద్ధి పనులు ప్రారంభించడంతో పాటు ఆయా పథకాల అమలు, జిల్లాలో జరుగుతున్న అభివద్ధి పనులపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. గురువారం రాత్రి ఆదిలాబాద్లోనే బస చేసి మరుసటి రోజున శుక్రవారం సైతం మావల పార్కులో వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ఉట్నూర్ పీఎంఆర్సీ భవనంలో ఆదివాసీ నాయకులతో సమావేశం కానున్నారు. అనంతరం నిర్మల్ జిల్లాలో పలు అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి**

మంత్రుల హోదాలో ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు రానున్న మంత్రులు జూపల్లి కష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామిలకు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9.30గంటలకు మావల బైపాస్ నుంచి ప్రారంభమై పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వరకు సాగుతుందని కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు మావల బైపాస్ వద్దకు వచ్చి ఈ ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు.





# గుర్తింపులేని ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించాలి

## మందమర్రి ఎంఈఓ కు బిఆర్ఎస్వి వినతి




**మంచిర్యాల, మహా :** మందమర్రి మండలంలో నెలకొన్న గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించాలని కోరుతూ గురువారం స్థానిక విద్యాశాఖ అధికారి దత్తు మూర్తికి భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి మండలంలో 49 ప్రభుత్వ పాఠశాలలు, 28 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్షం వలన సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ఈ కారణంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఆగడాలు శృతిమించుతున్నాయని ధ్వజమెత్తారు. మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, టాయ్లెట్స్, తరగతి గదులు, స్కూల్ డ్రెస్లు, ఉపాధ్యాయుల సంఖ్య మెరుగుపరచాలని వారు డిమాండ్ చేశారు. వివిధ ప్రైవేట్ పాఠశాలలలో అర్హత లేని వారు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వాటిని గుర్తించి విధులనుండి తొలగించాలని ఎంఈఓ కు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ప్రతి ప్రైవేటు పాఠశాలలో ఫీజు వివరాలు నోటీసు బోర్డులో పొందపరచాలని అన్నారు. ప్రైవేటు పాఠశాలలోని అన్ని స్కూల్ బుక్స్, పాఠశాల యూనిఫాంలు అధిక ధరలకు విక్రయించడాన్ని అరికట్టాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో అన్ని బస్సులు ఫిట్నెస్ చేయాలని కోరారు. ప్రభుత్వ ఆదర్శ మోడల్ కళాశాల, కస్తూరబ గాంధీ బాలికల హాస్టల్స్ లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని వివరించారు. ప్రభుత్వ ఒర్రెగడ్డ బాలుర పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, బెంచిలు అందించి పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మింపచేయాలని అన్నారు. రెండవ జూన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో తరగతి గదులను వెంటనే పూర్తి చేసి డైనింగ్ హాల్, టాయ్లెట్స్ ను పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. స్కూల్ యూనిఫాం పాఠ్యపుస్తకాలు ఇతరాత్రలు విద్యార్థులకు సకాలంలో అందజేయాలని ఎంఈఓ ను బడిబాటలో భాగంగా కోరినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎండి ముస్తఫా, బట్టు రాజ్ కుమార్, తోట సురేందర్, బి ముఖేష్, సిపల్లి సాగర్, మాసు వెంకటేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

# సన్నబియ్యమూ పక్కదారి..

## జిల్లాలో బరితెగిస్తున్న అక్రమార్కులు

- వివిధ బ్రాండ్ల పేరిట అధిక ధరలకు అమ్మకాలు
- విక్రయించిన వారి రేషన్ కార్డులు రద్దు..?
- విచారణ చేపడుతున్న అధికార యంత్రాంగం



**ఆదిలాబాద్, మహా:** ఇన్నాళ్లు దొడ్డు బియ్యాన్ని పక్కదారి పట్టించిన అక్రమార్కులు తాజాగా సన్నబియ్యాన్ని కూడా వదలడం లేదు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న పీడీఎస్ సన్న బియ్యాన్ని ఆకర్షణీయమైన సంచుల్లో నింపి వివిధ బ్రాండ్ల పేరిట బహిరంగ విపణిలో విక్రయిస్తుండటం చర్చనీయాంశమైంది. పోలీసులు, పౌరసరఫరాలశాఖ టస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు దుకాణాల్లో 79.30క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. రేషన్ లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే బియ్యాన్ని వివిధ బ్రాండ్ల పేరిట అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను మోసగిస్తున్నారు. జిల్లాలో ఇది వరకు దొడ్డు బియ్యం అనేక సార్లు పట్టుబడగా.. తాజాగా సన్నబియ్యం కూడా పక్కదారి పడుతుండటంతో అటు అధికార యంత్రాంగం.. ఇటు ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. సన్నబియ్యం పక్కదారి పట్టించిన అక్రమార్కుల్లో మంగళవారం ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ పంపించారు. పోలీసు, పౌరసరఫరాలశాఖ యంత్రాంగం ఈ పరిణామాలపై సీరియస్ గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై విచారణ చేపడుతున్న పోలీసులు ఈ బియ్యం విక్రయించిన వారి వివరాలను సైతం రాబడుతున్నారు.

**బ్రాండ్ల పేరుతో ..ఆకర్షణీయంగా మార్చి**

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉండి తెల్ల రేషన్ కార్డులు కలిగిన నిరుపేదలకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఒక్కో లబ్ధిదారుడికి 6కిలోల చొప్పున కుటుంబ సభ్యులందరికీ ప్రతి నెలా ఈ బియ్యం ఉచితంగా అందజేస్తోంది. ఇది వరకు దొడ్డు బియ్యం పంపిణీ చేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇది వరకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో అనేక మంది రేషన్ లబ్ధిదారులు వాటిని తినకుండా కిలోకు రూ.10చొప్పున మధ్య దళారులకు విక్రయించేవారు. కొందరు రేషన్ డీలర్లకే అమ్మేవారు. దీంతో కొందరు బియ్యం వ్యాపారులు లబ్ధిదారులతో పాటు డీలర్ల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని ఒక దగ్గర పెద్ద ఎత్తున పోగు చేసి లారీల ద్వారా మహారాష్ట్ర ప్రాంతానికి తరలించేవారు. ఇలా తరలించే క్రమంలో అనేక సార్లు అక్రమార్కులు పట్టుబడటం.. అధికారులు వారిపై 6ఏ కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. ఇది వరకు 278 కేసులు నమోదు చేసి సుమారు 2వేల మెట్రిక్ టన్నుల వరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. బియ్యం అక్రమార్కులు పలుమార్లు పట్టుబడినా మళ్ళీ ఇదే దందాను కొనసాగించినట్లు తెలుస్తోంది. తాజాగా జిల్లా పోలీసు యంత్రాంగం అక్రమాలపై ఉక్కుపాదం మోపుతుండటంతో పీడీఎస్ బియ్యం అక్రమాలపైనా దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో అనేక మంది లబ్ధిదారులు ఈ బియ్యాన్నితింటున్నారు. బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం కొనుగోలు చేయడం చాలా వరకు తగ్గిపోయింది. కానీ కొందరు లబ్ధిదారులు మాత్రం కిలోకు రూ.15 చొప్పున విక్రయిస్తుండటంతో మళ్లీ బియ్యం దందాకు తెరలేపిందనే చర్చ మొదలైంది. ఈ బియ్యం కొనుగోలు చేసిన దళారులు వివిధ రైస్ బ్రాండ్ల పేరిట ఆకర్షణీయమైన సంచుల్లో నింపి బహిరంగ విపణిలో విక్రయిస్తున్నారు. ఇద్దరిని పట్టుకొని అరెస్టు చేయడంతో ఈ అంశం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**రేషన్ కార్డులు రద్దు..?**

ప్రభుత్వం పేదలు కూడా సన్నబియ్యం తినాలనే ఉద్దేశ్యంతో ఉచితంగా పంపిణీ చేస్తుంటే..కొందరు మాత్రం ఈ బియ్యాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం..ఉన్నతాధికారులు ఈ బియ్యం విక్రయించిన లబ్ధిదారుల వివరాలను రాబట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన నిందితుల నుంచి వివరాలు సేకరించి బియ్యం విక్రయించింది ఎవరనే విషయమై తెలుసుకోనున్నారు. లబ్ధిదారుల వివరాలు వెల్లడైన తర్వాత వారి రేషన్ కార్డులు పూర్తిగా రద్దు చేయాలని యోచిస్తున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కొందరివి రద్దు చేస్తేనే మిగితా వారు భయపడి ఈ బియ్యం విక్రయించకుండా ఉంటారని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

**ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం**

ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తుంటే దళారులకు అమ్ముకోవడం సరికాదు. జిల్లాలో సన్నబియ్యం అక్రమాలపై విచారణ చేపడుతున్నాం. ప్రస్తుతం పట్టుబడిన బియ్యాన్ని గోదాముకు తరలిస్తాం. పౌరసరఫరాలశాఖ ద్వారా నిరంతరం తనిఖీలు చేపడుతాం. పట్టుబడిన బియ్యం ఘటనపై విచారణ జరుగుతోంది. అక్రమంగా తరలించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- వాజిద్ అలీ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి, ఆదిలాబాద్

# ఆటోను ఢీకొన్న లారీ

## ఏడుగురికి గాయాలు

**ఆదిలాబాద్, మహా** తలమడుగు, తాంసీ మండలాలకు వెళ్ళే ప్రధాన రహదారిలో గత కొన్ని రోజులుగా కేటీసీ లారీల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయనే చేసుకుంది. తలమడుగు మండలంలోని ఉండం ఆయేషా గార్డెన్ సమీపంలో కేటీసీ లారీ ఆటోను ఢీ కొనడంతో కేజీబీవీలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ఉపాధ్యాయురాళ్లు గాయాలపాలయ్యారు. సాయి లింగిలోని కేజీబీవీకి ఉదయం ఆటోలో వెళ్తున్న క్రమంలోనే ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా.. క్షతగాత్రులను హుటాహుటిన రిమ్స్ కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదంలో స్రవంతి, రోజాలకు తీవ్ర గాయాలు కాగా..రేవతి, సంధ్య, శ్వేత, గీతాంజలి, గంగమణిలకు గాయాలయ్యాయి. వారికి రిమ్స్ లో చికిత్స అందించగా.. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ తో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.




# తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

**ఆదిలాబాద్, మహా:** తిరుమల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రైల్వే స్టేషన్ లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భారీ వర్షం లోనూ అక్కడి పేదలకు అన్నదానం చేసి ఉదారత చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మహేందర్ , సామల రవిమణి, రాజు యాదవ్, బండ సునీల్ కుమార్, కుర్ర నరేష్ ,అనుముల ఉదయ్ కిరణ్,అయతీ సుమంత్, బండ మల్లికార్జున్, పాల్గొన్నారు.

# దాడులు చేస్తున్నది వారే... కేసులు పెడుతున్నది వారే..!

## రామగుండం సీపీకి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫిర్యాదు



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో దాడులు చేస్తున్నది వారే... కేసులు పెడుతున్నది వారే..! నని బి.ఆర్.ఎస్. మాజీ మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే, కొప్పుల ఈశ్వర్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యే లు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్యలు ధ్వజమెత్తారు. బుధవారం రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝాకు మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ నేతలపై చేస్తున్న దాడులపై లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలపై అధికార కాంగ్రెస్ ను ప్రశ్నిస్తున్న అట్టి నాయకులపై పోలీస్ కేసులు నమోదు, దాడులు చేయిస్తున్న తీరుపై వారు మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత తీవ్రస్థాయికి పెరిగిందని విమర్శించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తన అనుచర బృందంతో గంజాయి బ్యాచ్‌లను చేరదీసి దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల బీఆర్ఎస్ నాయకుడు దగ్గుల మధుపై దాడి చేసి అతని పైననే మంచిర్యాల పోలీసులు కేసు నమోదు చేశారన్నారని వారు వాపోయారు. అంతేకాకుండా గత సంవత్సరం వినాయక చవితి సమయంలో గడప రాకేష్, కందుల ప్రశాంత్‌లపై దాడులు చేసి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని వారు అసహనం వ్యక్తం చేశారు. ఈ దాడులపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీని కోరినట్లు వారు వెల్లడించారు. ఈ దాడుల విషయంపై తాము తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కు పిర్యాదులు చేసినట్లు వెల్లడించారు.




# సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

## రెండు నెలల్లో హాస్టల్ పైనుండి ఇద్దరు యువతుల ఆత్మహత్యాయత్నం

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా ప్రభుత్వ కాలేజీ రోడ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల భవనంపై నుండి ఒక విద్యార్థినీ దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కాగా భవనం 2 అంతస్థుల నుండి దూకిన విద్యార్థినీ స్వప్నకు తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. విద్యార్థినీకి అత్యున్నత వైద్యం కొరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. రెండు నెలల క్రితం ఇదే హాస్టల్ భవనం నుండి ఏప్రిల్ 24 న లక్ష్మిప్రసన్న దూకడంతో ఆమె చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. లక్ష్మి ప్రసన్న మృతి చెంది రెండు నెలలు గడవకముందే మరో విద్యార్థిని స్వప్న నిన్నరాత్రి 11గంటలకు భవనంపై నుండి దూకడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఆ విద్యార్థినీ ప్రమాదవశాత్తు భవనం పై నుండి పడిపోయిందా.. లేక హాస్టల్ సిబ్బంది వేధింపులు తాలలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా మంచిర్యాల సీఐ ప్రమోద్ కుమార్ కేస్ నమోదు చేసుకొని విచారణ కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరపాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఎంపీపీ ఎస్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి అక్కడున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరానికి గాను ఎంత శాతం విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ అయిందని, కొత్త యూనిఫామ్స్ విద్యార్థులకు ఇచ్చారా, ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలను ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలు చెబుతున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలలోని 6, 9వ తరగతులను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో నేరుగా కలెక్టర్ మాట్లాడారు. పాఠశాల ప్రాంగణంలోని మధ్యాహ్న భోజనం వంట గది వద్ద వంటలు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడే ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరు ను పరిశీలించి కేంద్రంలో అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రం లోని చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, స్థానిక తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంఈవో రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 27న డ్రగ్స్ కు వ్యతిరేకంగా 5కే రన్

**ఆదిలాబాద్, మహా:** డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఈ నెల 27న ఆదిలాబాద్ లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ఉదయం 6 గంటలకు 5K రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మొదటి 10 మంది విజేతలకు సైకిల్ బహుమతులు, పాల్గొన్న వెయ్యి మందికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. పాల్గొనేవారు https://forms.gle/UR2iPE6PYP9AkdoA7 లింక్ ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు

# కరీంనగర్ వాహనదారులు తస్మాత్ జాగ్రత్త

- క్లిక్ మనగానే ఈ చలానా
- రేపటి నుండి కరీంనగర్‌లో సీసీటీవీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనల పర్యవేక్షణ
- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



**కరీంనగర్ మహా:** ట్రాఫిక్ పోలీసు లేదని సిగ్నల్స్ జంప్ చేస్తున్నారా.. మమ్మల్ని ఎవరూ చూడడంలేదని ఒకే బండిపై ముగ్గురు బలాదూర్‌గా వెళ్తున్నారా? హెల్మెట్ ధరించకుండా వాహనాన్ని నడుపుతున్నారా? పరిమితికి మించి వేగంతో వెళ్తున్నారా? అయితే వాహనదారులు తస్మాత్ జాగ్రత్త..ఎందుకంటే మూడోకన్ను(సీసీ కెమెరా)లో చూసి జరిమానా విధించే విధానం కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో జూన్ 27 నుండి అమల్లోకి. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపిఎస్ బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా కరీంనగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో వాటి కనెక్టివిటీ.. వాటి పనితీరును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలీస్ కమిషనర్ కరీంనగర్ పట్టణ ప్రజలకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ లో భాగంగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలు జూన్ 27, 2025 నుండి పూర్తిగా అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు. ఈ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను పర్యవేక్షిస్తామని, తదనుగుణంగా చలాన్లు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ చర్యల యొక్క ప్రధాన లక్ష్యం పౌరుల భద్రతను పెంచడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం మరియు నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించడం అని కమిషనర్ పేర్కొన్నారు.

**సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో గుర్తించబడిన ముఖ్యమైన ట్రాఫిక్ ఉల్లంఘనలు:**

**ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్:** ట్రాఫిక్ సిగ్నల్ దాటి ముందుకు వెళ్లడం.

**హెల్మెట్ లేకుండా డ్రైవింగ్:** ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించకపోవడం.

**సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్:** కారు నడుపుతున్నప్పుడు సీట్ బెల్ట్ ధరించకపోవడం.

**రాంగ్‌సైడ్ డ్రైవింగ్:** వ్యతిరేక దిశలో డ్రైవింగ్.

**డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్ ఫోన్ ఉపయోగించడం:** వాహనం నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ ఉపయోగించడం.

**ట్రిపుల్ రైడింగ్:** ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించడం.

**అతివేగం / ర్యాష్ డ్రైవింగ్:** చాలా వేగంగా లేదా ప్రమాదకరమైన వేగంతో వాహనాన్ని నడపడం. పైన పేర్కొన్న ట్రాఫిక్ నిబంధనలలో దేనినైనా ఉల్లంఘించినందుకు వాహనదారులకు ట్రాఫిక్ చలాన్లు జారీ చేయబడతాయని కమిషనర్ హెచ్చరించారు.అందువల్ల, కరీంనగర్ నగర పౌరులు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని పోలీసులకు సహకరించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నోలో ఎన్నికల సందడి



**కరీంనగర్ మహా :** ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమే కాకుండా ప్రజా సంక్షేమంలో ప్రధాన భూమిక పాత్రపోషిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో లో కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ ఎన్నికల నిర్వహణ ప్రారంభానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల నిర్వాహణ ఒక గొప్ప అధ్యాయమని.. ఎన్నికలను సజావుగా నిర్వహించడానికై ఒక ప్రత్యేక కమీషనను ఏర్పాటు చేయడం జరిగినదని ఆ కమీషన్ ద్వారానే వివిధ ప్రాంతాలలో ఎన్నికల నియమావలిని రూపొందించి ఎటువంటి ఆటంకం లేకుండా ప్రజా స్వామ్య విలువలను పరిరక్షించే విధంగా ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా ఎన్నికల ద్వారానే ప్రజలు వారికి కావల్సిన వసతులను నచ్చిన నాయకుని ఎన్నుకొని సమకూర్చుకుంటారని.. అమూల్యమైన ఓటును వేస్తారని గుర్తు చేశారు. ప్రతి విద్యా సంవత్సరంలో పాఠశాలలోని విద్యార్థులను వివిధ విభాగాలుగా విభజించి ఎన్నికలను నిర్వహించడం జరిగినదని చెప్పారు. పాఠశాలలోని విద్యార్థులను లక్ష్య, తేజస్, ధృవ, సరన్ విభాగాలుగా చేయడం జరిగినదని ప్రతీ హౌజ్కు బాలికలకు బాలురకు క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్ ఎన్నికలను వేరువేరుగా నిర్వహించడం జరిగినదని చెప్పారు.

# పేదలకు అండగా నిలిచిన సనాతన హిందూ సేవా సమితి

## విజయవంతంగా 81 సేవా కార్యక్రమాలు పూర్తి

**వరంగల్ మహా;** దారిద్రరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు, ఎవరు లేని అభాగ్యులకు అండగా మేం ఉన్నామంటూ హిందూ ధర్మాన్ని అనుసరించి సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో 81 సేవా కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. బుధవారం 81వ సేవా కార్యక్రమాల్లో భాగంగా భర్త చనిపోయి ఆరోగ్య సమస్యల తో పాటు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కొండాపూర్ గ్రామానికి చెందిన దూల్మెట రాణి.. గర్నేపల్లి మణెమ్మ అనే ఈ రెండు నిరుపేద కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా సన్న బియ్యం తో పాటు నిత్యావసర వస్తువులను అందించి వారిని ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ వ్యస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, గ్రూప్ సభ్యులు నోముల మహేష్ బాబు, మాలోత్ రవి, పాల్తీయా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గ రైతులకు
# రైతు భరోసా అందించాం

**కాటా శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి**




**పటాన్ చేరు మహా :** పటాన్‌చెరు నియోజకవర్గంలోని అర్హులైన రైతులకు రైతు భరోసా నిధులు విజయవంతంగా జమ కావడాన్ని పురస్కరించుకుని, జిన్నారం గ్రామంలో రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేసిన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమణి, ఇచ్చిన మాట ప్రకారం పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి అర్హులైన రైతుకు రైతు భరోసా నిధులు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే నిలబెట్టుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కె.ఎస్.జీ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# మొక్కలను నాటండి పర్యావరణాన్ని కాపాడండి

**ప్రతి వార్డులో100 మొక్కలు నాటాలి.. జిల్లా అధ్యక్షులు రాజభూపాల్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా ;** వికసిత్ భారత్ అమృతకాలో కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధి మైలార్ దేవ్ పల్లి డివిజన్ 1 అధ్యక్షులు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ బుధవారం ప్రేమావతి పేట్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలను నాట్యారు. రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ 11 సంవత్సరాల సుపరి పరిపాలన అమృత్కాలుగా ప్రజలు అభివర్ణిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను 11 సంవత్సరాల పాలనలో ప్రవేశపెట్టి ప్రజల చెంతకు చేరిందన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం రావాలని ప్రజలు ఆశగా చూస్తున్నారు అన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు జరిగినా బిజెపి విజయ దంక మోగిస్తుందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్. సీనియర్ నాయకులు శ్రీధర్, కొమరయ్య, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జోగిరవి, ఆడికే రాజు, రాజునర్సింహా, వెంకటరమణగుప్తా, సంతు గౌడ్, విజయ్ కుమార్, సురేష్ ముదిరాజ్, సుధాకర్, నరోత్తం రెడ్డి, రఘు ముదిరాజ్, భవాని దాస్ రవి, రామారావు ,కిరణ్, యాదగిరి, వినయ్, నర్సింహా, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా హరితహారం



**మొక్కలు నాటిన బీజేపీ నాయకులు**

**అబ్దుల్లాపూర్మెట్, మహా:** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బుధవారం బలిజగూడ గ్రామంలో గ్రామ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమం (హరితహారం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , వనపర్తి జిల్లా ఇంచార్జ్ బోసుపల్లి ప్రతాప్ , ఇబ్రహీంపట్నం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నోముల దయానంద్ గౌడ్ , నాయకులు వడ్డేపల్లి పాపయ్య గౌడ్ , రంగా జంగమయ్య గౌడ్ , బండి గారి విష్ణు గౌడ్ , మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామి ఎంపీ యాదగిరి గౌడ్ , శీలో జు శ్రవణ్ చారి, బొడిగే సురేష్‌గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిర్మూలన అందరూ
# బాధ్యతగా తీసుకోవాలి

**షాద్ నగర్ సీఐ సి. విజయ్ కుమార్**

**షాద్ నగర్, మహా:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవం సందర్భంగా బుధవారం షాద్ నగర్ పట్టణంలో విశ్వ భారతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో స్లోగన్ రైటింగ్, చిత్ర లేఖనం కాంపిటీషన్ నిర్వహించారు. నినాద రచన పోటీలలో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా షాద్ నగర్ పట్టణ సీఐ సి. విజయ్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు అలవాటుపడి యువత తమ మేధాశక్తిని వృథా చేసుకోకూడదన్నారు. డ్రగ్స్ ఒకసారి వాడినా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజా యి, డ్రగ్స్ వినియోగాన్ని యూత్ సోషల్ స్టేటస్, ఫ్యాషన్గా ఎంచుకుంటోందని, దీనిద్వారా విలువైన జీవితాలు నష్టపోతారని ఆయన అన్నారు. సహనం కోల్పోయి ఇతరులపై దాడులు, హత్యలు, దొంగతనాలాంటి నేరాలకు పాల్పడే ప్రమాదం



ఉందని అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. స్కూళ్లు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకుంటున్నా విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం 1098 నెంబర్ కి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్సై ప్రణయ్ కళాశాల బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## జిల్లా విపత్తు నిర్వహణ బృందం సంసిద్ధంగా ఉంది

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, మహా:** రానున్న వర్షాకాలం దృష్ట్యా విపత్తు నిర్వహణ బృందం సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడటానికి విపత్తు నిర్వహణ బృందం (డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ) 20 మంది పోలీసు సిబ్బందితో పటిష్టంగా ఉందని తెలిపారు. బుధవారం సాత్నాల ప్రాజెక్టు వద్ద విపత్తు నిర్వహణ బృందంతో కలిసి పరికరాలకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బోటు నందు ప్రయాణించి శిక్షణ సిబ్బందికి ప్రత్యేకంగా సూచనలు ఇచ్చి అత్యవసర సమయంలో వెంటనే స్పందించేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ విపత్తు నిర్వహణ బృందం జిల్లాలో ఒక రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి ఆధ్వర్యంలో 20 మంది పోలీసు సిబ్బందితో శిక్షణ పూర్తి చేసి, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉందని వివరించారు. ముఖ్యంగా వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో వరదలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, రోడ్లపై చెట్లు విరిగిపడ్డ సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా రక్షణ



కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ డిడిఆర్ఎఫ్ బృందం వద్ద రెస్క్యూ బోటు, మోటార్ మిషన్, మెడికల్ స్ట్రక్చర్, లైఫ్ జాకెట్స్, లైఫ్ బాయ్స్, వుడ్ కట్టర్స్ మిషన్ లాంటివి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలకు ఆపత్కాలంలో ఈ బృందం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ బృందం హైదరాబాద్ లో వారం రోజులు పాటు శిక్షణ తీసుకొని అత్యవసరంగా స్పందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్. జీవన్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు డి సాయి నాథ్, కె ఫణిదర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి. వెంకటి, టి.మురళి, ఎన్. చంద్రశేఖర్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రాకేష్, డిడిఆర్ఎఫ్ బృంద సిబ్బంది పాల్గొన్నారు.

### ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పై
# మండిపడ్డ సబితా ఇంద్రారెడ్డి

- **ఎమ్మెల్యే కాల్ చేస్తే స్పందించరా అంటూ ప్రశ్నించారు**
- **జీహెచ్ఎంసి,మున్సిపాలిటీలలో వంద రోజుల ప్రణాళిక వల్ల ఉపయోగం ఏమి లేదు**



**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం, సరూర్ నగర్ డివిజన్ పరిధి లోని హుడా కాంప్లెక్స్ లో ప్రజల తో కలిసి సమస్య లను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అడిగి తెలుసుకున్నారు. జిహెచ్ఎంసి అధికారులకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై వివరించడం జరిగింది. జిహెచ్ఎంసి,మున్సిపాలిటీ పరిధి లో వర్షాకాలం సమయం లో నాలాల,డ్రైనేజీలలో సిల్టు తీయాలని కెసిఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయం లో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చే వారిని సబిత పేర్కొన్నారు. శానిటేషన్,చెత్తను క్లీన్ చేసే విషయం లో 100 రోజు ప్రణాళిక అంటూ ప్రత్యేక ఆదేశాలు ప్రభుత్వం ఇవ్వవలసిన అవసరం లేదని దాని కంటూ గతం నుంచే ఒక సిస్టం ఉందని ఎమ్మెల్యే సబిత పేర్కొన్నారు. సెకండ్ ఫేస్ ఎస్ ఎన్ డి పి నాలా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. వాటర్ బోర్డ్,జిహెచ్ఎంసి నిధులు లేవని చెప్తున్నారని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కి కాల్ చేస్తే కనీసం స్పందించడం లేదని సబితా ఆరోపించారు. జోనల్ కమిషనర్ సరిగా స్పందించకుంటే డివిజన్ లో ఉన్న సమస్యలు పరిష్కారం ఎలా అవుతాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కే జోనల్ కమిషనర్ స్పందించకుంటే ,ప్రజల సమస్యలపై ఇంకెలా స్పందిస్తారని విమర్శించారు. అధికారులను సమన్వయం చేసుకొని ప్రజల సమస్యల పై స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో లోకసాని కొండల్ రెడ్డి,ధర్పల్లి అశోక్,ఇంటూరి అంకిరెడ్డి,సుశీల రెడ్డి,గౌని శ్రీనివాస్ గౌడ్,రాజేష్, మహేందర్,రాజు యాదవ్, సునీల్ యాదవ్, అరుణ్ కుమార్ ,ఉత్తిపల్లి శ్రీనివాస్, హుడా కాంప్లెక్స్ సభ్యులు మల్లారెడ్డి, అనూప్ రాజా, సుధామా, సలీం, కిరణ్ కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# గంధం గూడ కొత్త చెరువును చెరబట్టింది ఎవరు

**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 66 లో 4 ఎకరాల 13 గుంటల విస్తీర్ణంలో కొత్తచెరువు రికార్డులలో ఉంది. గంధం గూడ కొత్త చెరువును చేరాబట్టిందెవరు. కబ్జారాయుళ్ల ఆగడాలు సుత్తి మించిపోయాయి. చెరువులు కుంటలు నాళాలు ప్రభుత్వ భూములు తమకు ఏవి అడ్డు కావని మరోసారి నిరూపించబడింది. యదేచ్చగా కొత్త చెరువులో మట్టి పోస్తూ నింపుతున్న రెవెన్యూ, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు ఇటుపక్క కన్ని ఎత్తి చూడట్లేదు. గత కొన్ని రోజులుగా కొత్త చెరువులో మట్టి నింపుతూన్నారంటు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన గంధం గూడ కొత్త చెరువును కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. అధికారుల సైగతోనే



తతంగమంతా నడుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేదవాడి నిర్మాణానికి అడ్డు తగులుతున్న అధికారులు కొత్తచెరువు చేరాబడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఇంత తతంగం జరుగుతున్న ఏ అధికారి చెరువును పరిశీలించే దాఖలాలు లేకుండా పోయాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెరువులను నాళాలను కుంటలను ప్రభుత్వ భూములను పరిరక్షిస్తుందని భుజాలు తరుముకుంటున్నాయి. తప్ప క్షేత్రస్థాయిలో అలాంటి పని కనిపించడం లేదని గంధంగూడా వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం గంధం గూడా కొత్తచెరువు కబ్జాకు గురవుతున్నట్టు గ్రహించి చెరువును చేరాపట్టిన వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### బావిలో పడి గల్లంతైన
## బాలుడి మృతదేహం లభ్యం

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడా లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సహాయక బృందాలు గజ ఈతగాళ్లతో కలిసి మంగళవారం బావిలో పడ్డ 5 సంవత్సరాల ప్రిన్స్ అనే బాలుని మృతదేహాన్ని13 గంటలు శ్రమించి బయటకు తీశారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లితండ్రులు కాలనీవాసులు. నిన్న మధ్యాహ్నం ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బావిలో పడ్డ ఐదేళ్ల ప్రిన్స్ అనే బాలుడు గల్లంత కావడంతో బావిలో ఉన్న నీటిని తోడి బుల్డోజర్స్ సహాయంతో బావిని తొవ్వి బాలుడి మృతదేహాన్ని బయటకు తీసిన అధికారులు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని తాకట్టు పెట్టిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ భారతదేశ ప్రజాస్వామ్యాన్ని తాకట్టు పెట్టిందని ఎమర్జెన్సీపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్యలు ఆరోపించారు. భారతదేశంలో జూన్ 25, 1975న అత్యవసర పరిస్థితి విధించిన నేపథ్యాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఏబి కాంప్లెక్స్ లో సంవిధాన్ హత్యా దివస్ అభియాన్‌ను భారతీయ జనతా పార్టీ నిర్వహించింది. ఈ అత్యవసరపరిస్థితి విధించి నేటికి 50 ఏళ్లు నిండాయనీ దీనికి గుర్తుగా ఆనాటి పరిస్థితిని వివరిస్తూ బిజెపి నాయకులు ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లిన ఉద్యమకారులను అదేవిధంగా స్థానిక జర్నలిస్టులను గౌరవప్రదంగా సన్మానించారు. ఈ అత్యవసర పరిస్థితి విధించి యాభై ఏళ్లు గడిచాయని, ఇది భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయాలలో ఒకటని వారు ఈ సందర్భంగా అన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని తాకట్టు పెట్టిందంటూ శ్రీవర్ధన్ రెడ్డి, బాబయ్యలు విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, దీనిని వ్యతిరేకించిన వారితోపాటు సుపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకులను కూడా జైల్లో పెట్టించిందని విమర్శించారు. అనాటి ఎమర్జెన్సీలో మొట్టమొదట మీడియా గొంతును నొక్కడం జరిగిందని పేర్కొన్నారు. అందుకోసమే మీడియా ప్రతినిధులను తాము బిజెపి తరఫున సన్మానం చేస్తున్నట్లు శ్రీవర్ధన్ రెడ్డి ప్రకటించారు. గొప్ప సంస్కృతి ఉన్న భారతదేశా



న్ని మూడు దేశాలుగా విభజించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికే నాగరికత నేర్పిన ఈ దేశాన్ని మూడు ముక్కలుగా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని తాకట్టు పెట్టిన సమయం అది అంటూ పేర్కొన్నారు. మన రాజ్యాంగం స్వరాన్ని ఎలా అణచివేశారో ఏ భారతీయుడు మర్చిపోలేడనీ.. పార్లమెంటు స్వరాన్ని అణచివేసి, అన్ని వర్గాలను నియంత్రించడానికి ప్రయత్నాలు జరిగాయన్నారు. పేదలు, అణగారిన వర్గాలు, దళితులను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆయన అన్నారు. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాటంలో దృఢంగా నిలిచిన వారందరికీ మేము వందనం చేస్తున్నామని అన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని రక్షించడం కోసం మన స్వాతంత్ర్య సమరయోధులు తమ జీవితాలను అంకితం చేశారని తెలిపారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ 25 జూన్ 1975లో దేశంలో ఎమర్జెన్సీని



విధించిన తర్వాత, అప్పట్లో దేశంలో మానవ హక్కుల ఉల్లంఘనల గురించి ఆసక్తికర విషయాలను ఉద్యమకారులు సభలో వివరించారు. ప్రధాని మోడీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్చుకోలేక రాజ్యాంగాన్ని మారుస్తున్నారన్న అపవాదులు అంటగట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని శ్రీ వర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని అత్యధిక సార్లు మార్చేందుకు కుట్ర చేసింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. దేశ భవిష్యత్తు కోసం ఆర్టికల్ 370 కాశ్మీర్ కోసం మార్చడం జరిగిందన్నారు. ఈ దేశంలో జరుగుతున్న ఆటవిక చర్యలను అడ్డుకోవడానికి మార్పు చేసిందన్నారు. ముస్లిం మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న తలాక్ లాంటి సమస్యలను అధిగమించడానికి మార్పులు చేశామన్నారు. దేశంలో ఇతర దేశాలకు సంబంధించిన చొరబాటుదారులు రావడానికి అడ్డుకునేందుకు మార్పు చేయాల్సి వచ్చింది అన్నారు. దిశ పౌరసత్వ చట్టాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా పాలిస్తున్న ఏకైక ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు. జై బాబు జై సంవిధాన్ జై భీమ్ కార్యక్రమాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఆనాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ఎన్నికల్లో ఓడగొట్టారని ఆరోపించారు. గాంధీల పేరుతో నకిలీ గాంధీలు వెలిశారని ఘాటుగా వ్యాఖ్యానించారు.
అందుకే ఈ ప్రజాస్వామ్య దేశంలో ఒక సామాన్యుడు ఛాయివాలా దేశ ప్రధానిగా మారి ప్రజలను పాలిస్తున్నారంటే ఈ దేశ రాజ్యాంగ ఉన్నత్యాన్ని గొప్పగా చాటుకోవాలని అన్నారు. ఎమర్జెన్సీలో జైలు జీవితాన్ని అనుభవించిన స్థానికులు కందూరి కృష్ణారెడ్డి సిరసని, బాల్ రెడ్డి, రఘుపతి రెడ్డి, వీరాంజనేయులు గౌడ్, మహమ్మద్ జామిలను ప్రత్యేకంగా సన్మానించారు. అదేవిధంగా స్థానిక జర్నలిస్టులు లట్టుపల్లి మోహన్ రెడ్డి బాల రాజేష్ సారాపు రమేష్ భాస్కర్ రమేష్ తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమం బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో జరగగా ఈ కార్యక్రమానికి ఇన్చార్జిగా అందే బాబయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్ దేపల్లి అశోక్ గౌడ్ కమ్మరి భూపాల్ చారి కందూరు మనోహర్ రెడ్డి నందిగామ వెంకటేష్, ప్రశాంత్ తదితరులు హాజరయ్యారు..

# రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సొసైటీ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్ మండల రైతులతో కలిసి బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్ మాట్లాడుతూ రైతులకు ఆసరా రైతు భరోసా నిధులను రైతులు ఖాతాలో వేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తు రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతులకు భరోసా నిధులను సరైన సమయంలో వేసిన ముఖ్యమంత్రి కి మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గదే



రాజశేఖర్, నిరటి రాజు, చంద్రారెడ్డి, రవి నాయక్, మహేందర్ ముదిరాజ్, కోటేశ్వర్ గౌడ్, ప్రభాకర్ యాదవ్, శ్రీకాంత్ గౌడ్, హోమ్లా నాయక్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, గోపాల్ యాదవ్, శివాజీ, ఉదయ్ గౌడ్, మలా రెడ్డి, సత్యానందం,, జూర్కి రమేష్,నిరటి శేఖర్, శ్రీనివాస్, కృష్ణ ,అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే భూ కబ్జా కేసులో నమోదు చేస్తాం

**తహసిల్దార్ రవీందర్ దత్త్**

**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధి మదనపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 50 ప్రభుత్వ భూములను ఆక్రమించి ఫ్రీకాస్ట్ వేస్తుండడం తో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసిల్దార్ రవీందర్ దత్త్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారి కృష్ణయ్య తన సిబ్బందితో కలిసి మదనపల్లి సర్వే నెంబర్ 50 ప్రభుత్వ భూములలో ఏర్పాటుచేసిన ఫ్రీ కాస్ట్ ను నీలమట్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు నమోదు చేస్తామని తహసిల్దార్ రవీందర్ దత్త్ హెచ్చరించారు.



## అండర్ గ్రౌండ్ పనులలో నాణ్యత పాటించాలి



**కార్పొరేటర్ గోకారి శ్రీలత సురేష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ లో 18 వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులలో నాణ్యత పాటించాలని మాజీ కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్ గౌడ్ అన్నారు. మాట్లాడుతూ బండ్లగూడ 18 వ వార్డులో అభివృద్ధి కోరకు నిరంతరం శ్రమిస్తున్న తనకు సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. బండ్లగూడ డివిజన్లో పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కార్పొరేటర్ గౌరికా శ్రీలత సురేష్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.






# విశాఖలో కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్

ఐటీ సర్వీసులు అందించే ప్రముఖ కంపెనీ కాగ్నిజెంట్ తన భారత కార్యకలాపాలను బలోపేతం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో రూ.1,583 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక టెక్నాలజీ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. వైజాగ్‌లోని కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 22 ఎకరాల్లో మూడు దశల్లో అభివృద్ధి చేయనున్న ఈ క్యాంపస్ ద్వారా 8,000 మందికి పైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపింది. 2026లో 800 మంది అసోసియేట్లకు వసతి కల్పించేలా తాత్కాలిక కేంద్రం ద్వారా కార్యకలాపాలు ప్రారంభమవుతాయని కంపెనీ పేర్కొంది. 2029 ప్రారంభంలో పూర్తి స్థాయి క్యాంపస్ అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేసింది. విశాఖపట్నం ప్రతిభకు, మౌలిక సదుపాయాలకు ప్రత్యేకంగా నిలుస్తున్నట్లు కాగ్నిజెంట్ సీఈఓ ఎస్.రవి కుమార్ తెలిపారు. దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో సంస్థ విస్తరించాలనే లక్ష్యానికి అనుగుణంగా వైజాగ్‌లో క్యాంపస్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కాగ్నిజెంట్ డిజిటల్ ఎకానమీని మరింత వేగవంతం చేస్తుందని, అదే సమయంలో భవిష్యత్తులో శ్రామిక శక్తికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంచుతుందని ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అన్నారు. భారతదేశం అంతటా వ్యూహాత్మక విస్తరణలో భాగంగా కాగ్నిజెంట్ ఇప్పటికే భువనేశ్వర్, ఇండోర్‌లో కొత్త కేంద్రాలను, గుజరాత్లోని గిఫ్ట్ సిటీలో ఫైనాన్స్ హబ్‌ను ఏర్పాటు చేసిందని కంపెనీ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 70 శాతానికి పైగా కంపెనీ శ్రామిక శక్తి భారత్‌లో ఉన్నందున కాగ్నిజెంట్ భారీగా పెట్టుబడులు పెడుతోంది.

# మలేరియా టీకా ధరలు తగ్గించిన భారత్ బయోటెక్!

ప్రపంచంలోనే మొట్టమొదటి మలేరియా టీకా ధరలను ఈ వ్యాధి ప్రబలంగా ఉండే కొన్ని దేశాల్లో సగానికి తగ్గిస్తున్నట్లు భారత్ బయోటెక్, జీఎస్‌కేలు ప్రకటించాయి. ఆయా దేశాల్లో 2028 నుంచి మలేరియా నివారణ టీకాలు ఐదు డాలర్ల కంటే తక్కువ ధరకు లభిస్తాయని ఇరు సంస్థలు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపాయి. ప్రపంచవ్యాప్తంగా పేద దేశాలకు వ్యాక్సిన్లను పంపిణీ చేసేందుకు ఏర్పాటైన 'ద వ్యాక్సిన్ అలయన్స్'కు 2026 2030 మధ్య సరఫరా చేసే టీకాలపై ఒక ఒప్పందం కుదిరిన సందర్భంగా ఇరు సంస్థలు ఈ విషయాన్ని తెలిపాయి. జీఎస్‌కే, పాథ్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన మలేరియా టీకా ఆర్‌టీఎస్.ఎస్‌ను మలేరియా నివారణకు ఉపయోగించవచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2021లోనే అనుమతులిచ్చింది. అయితే ఉత్పత్తి మార్గాల్లో మెరుగుదల, సామర్థ్యం పెంపు, లాభాన్ని కనీస స్థాయిలో ఉంచడం వంటి కారణాల వల్ల టీకా ధర సగానికి తగ్గించడం వీలైందని భారత్ బయోటెక్, జీఎస్‌కేలు వివరించాయి. ''వ్యాక్సిన్ అలయెన్స్‌కు టీకాల సరఫరా చేస్తామన్న ఒప్పందం కుదరడం వల్ల లక్షల మంది పిల్లలు, కుటుంబాలపై మలేరియా సమస్య తగ్గిపోతుంది. ఈ చర్య మాకు కేవలం వ్యాక్సిన్ అలయన్స్‌కు సహకరించడం మాత్రమే కాదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం'' అని భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా తెలిపారు. జీఎస్‌కే సహకారంతో ప్రపంచవ్యాప్తంగా మలేరియా బాధిత బాలలు, వారికి అందుబాటులో ఉన్న టీకాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తున్నాం అని చెప్పారు. న్, పాథ్, ప్రపంచ ఆరోగ్య సంస్థల సహకారం కూడా ఉంది.'' అని అన్నారు. కాగా, ఘన, కీన్యా, మలవాయి వంటి దేశాల్లో ఇటీవలే సుమారు ఇరవై లక్షల మంది పిల్లలకు మలేరియా టీకా ఇవ్వడం వల్ల ఈ వ్యాది కారణంగా మరణించే వారి సంఖ్య 13 శాతం వరకూ పడిపోయిందని, ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య 22 శాతం తగ్గిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా అధ్యయనం ద్వారా తెలిసింది. మలేరియా సమస్య ఎక్కువగా ఉన్న చోట్ల ఈ టీకాతోపాటు మలేరియా సీజన్‌లో తగిన మందులు ఇవ్వడం ద్వారా వ్యాధిని గణనీయంగా నివారించడం సాధ్యమైందని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.




# ముంబై ఎయిర్‌పోర్ట్ కోసం అదానీ నిధుల సమీకరణ

**న్యూఢిల్లీ:** గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల నుంచి డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ బిలియన్ డాలర్లు (సుమారు రూ. 8,600 కోట్లు) సమీకరించింది. నిధులను ముంబై ఎయిర్‌పోర్ట్ రుణాల రీఫైనాన్సింగ్‌కు వినియోగించనుంది. న్యూయార్క్ సంస్థ అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షతన మెట్‌లైఫ్ ఇంక్, బ్లాక్‌రాక్ ఇంక్, ఎఫ్‌డబ్ల్యూడీ ఇన్సూరెన్స్ నిధులు సమకూర్చాయి. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఎంఐఏఎల్) కోసం 2022లో సమీకరించిన రుణాల రీఫైనాన్స్‌కు నిధులు వెచ్చించనున్నట్లు అదానీ గ్రూప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. ఎంఐఏఎల్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ వాటా 74 శాతంకాగా.. భారత ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి 26 శాతం వాటా ఉంది. దేశీయంగా రెండో పెద్ద ఎయిర్‌పోర్ట్‌ను నిర్వహిస్తున్న కంపెనీ 2029 జులైలో గడువుతీరే 75 కోట్ల డాలర్ల విలువైన నోట్లను జారీ చేసింది. వీటికి అదనంగా 25 కోట్ల డాలర్ల నోట్లను జారీ చేసే వీలుతో నిధుల సమీకరణ చేపట్టింది. తద్వారా బిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. దీంతో ఎంఐఏఎల్ అభివృద్ధి, ఆధునీకరణ, సామర్థ్య విస్తరణకు ఆర్థిక వెసులుబాటు లభించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలియజేసింది. తాజాగా జారీ చేసిన బాండ్లు 6.9 శాతం కూపన్‌రేటుతో నాలుగేళ్ల కాలానికి గడువు తీరనున్నాయి. ఎయిర్‌పోర్ట్ మౌలికసదుపాయాల రంగంలో తొలి ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ప్రయివేట్ బాండ్ల జారీని చేపట్టినట్లు కంపెనీ పేర్కొంది.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. చమురు ధరల పతనం, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఇన్వెస్టర్ల ఆందోళనలను తగ్గించడంతో మీడియా, టెక్ షేర్లలో లాభాలతో భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో సెషన్లో లాభాలను ఆర్జించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఇండెక్స్ 700.4 పాయింట్లు లేదా 0.85 శాతం పెరిగి 82,755.51 వద్ద ముగియగా, నిఫ్టీ 50 కూడా 200.40 పాయింట్లు లేదా 0.8 శాతం పెరిగి 25,244.75 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.44 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం పెరిగాయి. నిఫ్టీ మీడియా, ఐటీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు వరుసగా 1.99 శాతం, 1.64 శాతం, 1.43 శాతం చొప్పున లాభపడ్డాయి. టైటాన్ కంపెనీ, ఎంఅండ్ఎం, ఇన్ఫోసిస్, పవర్ గ్రిడ్, టీసీఎస్, భారతీ ఎయిర్టెల్ 3.6 శాతం వరకు లాభపడ్డాయి. బీఈఎల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి, మార్కెట్ అస్థిరతను అంచనా వేయడానికి ఉపయోగించే భయ సూచిక ఇండియా వీఐఎక్స్ దాదాపు 5 శాతం పడిపోయి 12.96 పాయింట్లకు పడిపోయింది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# క్యాబ్ డ్రైవర్లకు ఇక గడ్డుకాలమే!

**అవును. నిజం. ఒకట్రెండేళ్లలో క్యాబ్‌డ్రైవర్లు అనే వారు ఉండకపోవచ్చు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కారణంగా ఊబర్, ఓలా, ర్యాపిడో వంటివి పుట్టుకొచ్చి క్యాబ్ డ్రైవర్ల ఆదాయంలో కొంత వాటా పంచుకుంటూంటే... రోబోటిక్స్, అటానమస్ వెహికల్ టెక్నాలజీ కాస్తా... డ్రైవర్ల ఉద్యోగాలకే గండికొట్టే సూచనలు కనిపిస్తున్నాయి. డ్రైవర్ల అవసరం లేని కార్లను టెస్లా ఎప్పుడో తయారు చేసింది కదా? అప్పుడు లేని సమస్య ఇప్పుడెందుకు వస్తుందని అంటున్నారా? సింపుల్.. టెస్లాతోపాటు ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇప్పుడు ఈ అటానమస్ వెహికల్ టెక్నాలజీని క్యాబ్స్‌గా మార్చే ప్రయత్నాల్లో ఉన్నాయి మరి!**

టెస్లా ఇప్పటికే తన సైబర్ ట్రక్‌ను క్యాబ్ సర్వీసులు అందించేలా మార్చి పరిశీలిస్తూండగా.. అమెజాన్ వచ్చే ఏడాది నుంచి ఏటా కనీసం పదివేల రోబో ట్యాక్సీలను సిద్ధం చేస్తోంది. కాలిఫోర్నియా రాష్ట్రంలోని హేవర్డ్ ప్రాంతంలో అమెజాన్ సుమారు 2.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రోబో ట్యాక్సీల తయారీకి ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. నలుగురు ప్రయాణించగల విశాలమైన ట్రక్కులాంటి ఈ వాహనం పేరు జూక్స్. అన్నీ సవ్యంగా సాగితే ఈ ఏడాది చివరికల్లా కొన్ని వాహనాలు లాస్ వేగస్ నగరంలో పరుగులు పెడతాయి కూడా. ఆ తరువాత.. దశలవారీగా మయామీ, ఆస్టిన్, శాన్‌ఫ్రాన్సిస్కోలకు వీటి సేవలను విస్తరించనున్నారు. ప్రస్తుతం ఈ వ్యాన్లను టెస్ట్ ట్రాక్‌పై నడిపి పరిశీలిస్తున్నారు కూడా. డ్రైవింగ్ తీరుతెన్నులు, పికప్.. డ్రాప్‌ఆఫ్‌ల సందర్భంగా ఏమేం జరుగుతున్నాయో తెలుసుకుంటున్నారు. మరోవైపు.. టెస్లా కంపెనీ కూడా తన సైబర్ ట్రక్‌ను కాస్తా సైబర్ క్యాబ్‌గా మార్చే ప్రయత్నాల్లో ఉంది. 2027 నాటికి తొలి దశ వాహనాలను రోడ్లపైకి ఎక్కిస్తారు. రోబోట్యాక్సీ అని పిలుస్తున్న ఈ వాహనంలో ఇద్దరు ప్రయాణించవచ్చు. స్టీరింగ్ వీల్, పెడల్స్ వంటివేవీ ఉండవు. అన్నీ కృత్రిమ మేధ ద్వారానే జరిగిపోతాయి. ఒకసారి ఛార్జ్ చేస్తే సుమారు 320 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలవు. ముందు, వెనుక ఎక్కడ అద్దాలుండవు. కెమెరాలు, సెన్సర్ల ద్వారానే పరిసరాలను గమనిస్తూ డ్రైవ్ చేస్తుందీ వాహనం. ఒక్కో రోబోట్యాక్సీని 30,000 డాలర్లకు అమ్మేందుకు టెస్లా ప్రయత్నిస్తోంది.



### మానవ డ్రైవర్ల పరిస్థితి?

జూక్స్, రోబోట్యాక్సీలు విస్తృత స్థాయిలో అందుబాటులోకి వస్తే మానవ డ్రైవర్లకు గడ్డుకాలమే!. ప్రస్తుతానికి ఇవి అమెరికాకే పరిమితం కావచ్చు కానీ... భవిష్యత్తులో ఇతర ప్రాంతాలకు మరీ ముఖ్యంగా వివిధ దేశాల్లోని నగర ప్రాంతాలకు విస్తరించడం ఖాయం. అదే జరిగితే ట్యాక్సీ డ్రైవర్లకు డిమాండ్ తగ్గిపోతుంది. రోబో ట్యాక్సీలో ఒక ఒక మైలు ప్రయాణించేందుకు 0.20 డాలర్లు ఖర్చు అవుతుందని, బస్సులతో పోలిస్తే ఇది నాలుగు రెట్లు తక్కువ అని టెస్లా ఇప్పటికే ప్రకటించింది. ఇదే వాస్తవమైతే చవక కాబట్టి వీటిల్లో ప్రయాణించేందుకే మొగ్గు చూపుతారు. కాకపోతే..మానవ డ్రైవర్లను ఈ రోబోట్యాక్సీ నిర్వహణకు ఉపయోగించుకోవచ్చునని ఒక అంచనా.



అంతేకాదు... కొంతమంది అభిప్రాయం ప్రకారం ఈ రోబో ట్యాక్సీలు మానవ డ్రైవర్లను పూర్తిగా లేకుండా చేయలేవు. ఎందుకంటే ఇలాంటి వాహనాల భద్రత, నియంత్రణలకు సంబంధించిన నిబంధనలు ఇప్పటి వరకూ రూపుదిద్దుకోలేదు. ప్రభుత్వాలు పూనుకుని వీటిని సిద్ధం చేసేందుకు చాలా సమయమే పట్టవచ్చు. మరికొంత మంది అభిప్రాయం ప్రకారం అటానమస్ వాహనాలు నగరాల్లో కొన్ని నిర్దిష్ట మార్గాలకు మాత్రమే పరిమితమవుతాయి. సంక్లిష్టమైన రూట్లలో మానవ డ్రైవర్లనే ఉపయోగిస్తారు.

# శశి థరూర్... ఈసారి ఫ్రెంచ్‌లో!

**కీవ్:** తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఇంగ్లీషు భాషా ప్రావీణ్యం గురించి కొత్తగా చెప్పేందుకు ఏమీ లేదు కానీ.. ఆయన ఫ్రెంచ్‌లోనూ అదరగొట్టగలరని మాత్రం తాజాగా స్పష్టమైంది. అది కూడా రష్యా దౌత్యవేత్తతో మాట్లాడుతూ! విషయం ఏమిటంటే... పహల్గామ్ దాడి తరువాత దాయాది దేశం పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' గురించి ప్రపంచదేశాలకు వివరించే పార్లమెంటరీ బృందానికి శశి థరూర్ నాయకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ బృందం ప్రస్తుతం మాస్కోలో పర్యటిస్తోంది. ఈ సందర్భంగా రష్యాలోని లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు లియోనిడ్ స్లట్‌స్కీతో థరూర్ బృందం సమావేశమైంది. భారత్ హస్తకళల వైభవాన్ని చాటే ఒక జ్ఞాపికను రష్యా దౌత్యవేత్తకు అందించిన థరూర్.. ప్రతిగా ఆయన అందించిన అరుదైన పెన్నును స్వీకరించారు. ''రాతగాడికి పెన్ను బహుమానంగా ఇవ్వడం సంతోషాన్నిచ్చింది'' అని వ్యాఖ్యానించారు. ఆ తరువాత ఇరువురి మధ్య చర్చలు ఉగ్రవాదం.. నివారణ చర్యలు.. రషా ఏం చేస్తోందన్న అంశాల పైకి మళ్లింది.. ఈ సందర్భంగా లియోనిడ్ స్లట్‌స్కీ మాట్లాడుతూ.. ''రష్యా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో బహుముఖ వ్యూహం అనుసరిస్తోంది. ఇందులో భాగంగా ఏటా సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ఆరుసార్లు ఈ సమావేశాలు జరిగాయి. వచ్చే ఏడాది ఏడో సమావేశం నిర్వహిస్తున్నాం. పాకిస్థాన్‌తోపాటు ఇతర దేశాలను ఆహ్వానిస్తున్నాం'' అని అన్నారు. పాకిస్థాన్ పేరు వినపడగానే స్పందించిన శశిథరూర్ భారత దౌత్యవేత్తల అంతర్జాతీయతను గుర్తు చేసేలా ఫ్రెంచ్‌లో స్లట్‌స్కీకి సమాధానమిచ్చారు. ''పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయమిచ్చే దేశం'' అని గుర్తు చేశారు. తద్వారా రష్యాతోపాటు యూరోపియన్ దేశాల దౌత్యవేత్తలకు భారత్ ఉద్దేశాలను స్పష్టం చేసినట్టు అయ్యింది. అయితే థరూర్ వ్యాఖ్యలను విన్న స్లట్‌స్కీ పాకిస్థాన్‌ను ఆహ్వానించడాన్ని సమర్థించుకున్నారు.అది వేరే విషయం!




# వలస ఖైదీలను మూడో దేశానికి పంపొచ్చు

## అమెరికా సుప్రీంకోర్టు

**వాషింగ్టన్:** వలసదారులను వారి స్వదేశాలకు కాక ఇతర దేశాలకు తిరిగి పంపించే ప్రక్రియకు అమెరికా సుప్రీంకోర్టు మార్గం సుగమం చేసింది. వలసదారులను మూడో దేశానికి పంపడం వల్ల వారు ఎదుర్కొనే ప్రమాదాలను అధికారులకు చెప్పడానికి అవకాశం ఇవ్వాలని కోరుతూ దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును తోసిపుచ్చింది. ఇది అక్రమాలకు వారు అనుభవించే ప్రతిఫలమని కోర్టు వ్యాఖ్యానించింది. వలసదారుల బహిష్కరణలపై కఠిన వైఖరి అవలంబిస్తున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఊరటను ఇచ్చింది. ఈ కేసులో మయన్మార్, దక్షిణ సూడాన్, క్యూబా, మెక్సికో, లావోస్, వియత్నాం దేశాలకు చెందిన ఎనిమిది మంది వలసదారులు ఉన్నారు. వీరిని మే నెలలో దక్షిణ సూడాన్‌కు వెళ్తు విమానంలో పంపించారు. అయితే వలసదారులను మూడో దేశాలకు తరలిస్తే అక్కడ వారు హింసకు లేదా హత్యకు గురయ్యే అవకాశం ఉందన్న అప్పీళ్లను సుప్రీం కొట్టిపారేసింది. కోర్టు తీర్పు భయంకరమైనదని నేషనల్ ఇమ్మిగ్రేషన్ లిటిగేషన్ అలయన్స్ తెలిపింది. ఈ నిర్ణయం తమ క్లయింట్లను హింసకు, మరణానికి గురిచేసిందన్నారు. ఈ తీర్పు అమెరికా ప్రజల భద్రత, రక్షణకు విజయమని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. ఎనిమిది మంది వలసదారులు అమెరికాలో హత్య, దహనం, సాయుధ దోపిడీతో సహా క్రూరమైన నేరాలకు పాల్పడ్డారని తెలిపింది.

# మహాసముద్రంలో మంటలు..

## వేలాది వాహనాల కార్గో షిప్ మునక



**మెక్సికో సిటీ:** నార్త్ అమెరికాలోని మెక్సికోకు ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు పలు ఆటోమొబైల్స్‌ను తీసుకెళ్తున్న కార్గో షిప్ ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో మునిగిపోయింది. అకస్మాత్తుగా మంటలు చెలరేగడం, అననుకూల వాతావరణం కారణంగా భూమి నుండి 415 మైళ్ల దూరంలో 'మార్నింగ్ మిడాస్' షిప్ మునిగిపోయింది. 600 అడుగుల విస్తీర్ణం కలిగిన ఈ కార్గో షిప్ జూన్ 3న అలాస్కా తీరానికి 300 మైళ్ల దూరంలో మంటల్లో చిక్కుకుంది. ఈ షిప్ మూడు వేల కొత్త వాహనాలను మెక్సికోకు డెలివరీ చేసేందుకు తరలివెళుతోంది. వాటిలో 800 ఎలక్ట్రిక్ వాహనాలున్నాయి. ఆన్‌బోర్డ్‌లో మంటలు చెలరేగడంతో ప్రమాదం భారీగా జరిగిందని సమాచారం. లండన్‌కు చెందిన 'జోడియాక్ మారిటైమ్' తెలిపిన వివరాల ప్రకారం, అలాస్కాలోని అలూటియన్ దీవుల అంతర్జాతీయ జలాల్లో షిప్ మునిగిపోయింది. ఈ సంఘటన తర్వాత విపరీతమైన కాలుష్య ప్రభావం కనిపించలేదని యూఎస్‌ఎస్ కోస్ట్ గార్డ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. కాలుష్య నియంత్రణ కోసం రెండు సాల్వేజ్ టగ్‌లను క్యారియర్ మునిగిపోయిన ప్రాంతంలో ఉంచినట్లు ఆయన తెలిపారు. అలాస్కా తీరానికి 300 మైళ్ల దూరంలో 600 కార్గో షిప్ అగ్నిప్రమాదంలో చిక్కుకున్నప్పుడు, ఆ షిప్‌లోని సిబ్బంది ఈ సమాచారాన్ని యూస్ కోస్ట్ గార్డ్‌కు అందించారు. వెంటనే స్పందించిన కోస్ట్ గార్డ్ ప్రమాద స్థలానికి చేరుకుని, 22 మందిని లైఫ్ బోట్‌లలో తరలించింది. క్యారియర్ సమీపంలోని ఒక మర్చంట్ మెరైన్ నౌక సహాయక చర్యల్లో పాల్గొంది.

# హార్దిక్ పాండ్యతో డేటింగ్‌పై నటి క్లారిటీ

సినిమా, క్రికెట్ సెలబ్రిటీల బంధాల గురించి ఎప్పటికప్పుడు ఏదో ఒక రూమర్ వినిపిస్తూనే ఉంటుంది. కొన్నిసార్లు అది నిజమైతే కొన్నిసార్లు అది పుకారుగానే మిగిలిపోతుంది. కొన్నిరోజుల క్రితం హార్దిక్ పాండ్య, నటి ఈషా గుప్తా డేటింగ్ గురించి కొన్ని రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు వాటిపై సదరు నటి స్పందించింది. అసలేం జరిగిందో చెప్పి పూర్తి క్లారిటీ ఇచ్చేసింది. 'కొన్నినెలల పాటు మేమిద్దరం మాట్లాడుకున్నాం. మా మధ్య స్నేహం ఏర్పడింది. మేం డేటింగ్‌లో ఉన్నామని అనుకోవట్లేదు. మేం మాట్లాడుకోవడం మొదలుపెట్టినప్పుడు.. డేటింగ్‌లోకి వెళ్లే ఛాన్స్ ఉండొచ్చు, ఉండకపోవచ్చని ముందే ఫిక్స్ అయ్యాం. కానీ రిలేషన్‌లోకి అడుగుపెట్టకుండానే విడిపోయాం. రెండు, మూడుసార్లు కలిసుంటాం. కానీ కొన్నినెలల పాటు మా రిలేషన్ కొనసాగింది. తర్వాత అది ముగిసిపోయింది' అని ఈషా గుప్తా చెప్పుకొచ్చింది. 2012లో 'జన్నత్' అనే హిందీ సినిమాతో నటిగా ఈషా గుప్తా కెరీర్ ప్రారంభించింది. బేబీ, రుస్తుం, కమాండో 2 తదితర హిందీ చిత్రాల్లో నటించింది. వీడెవడు అనే తెలుగు మూవీలో హీరోయిన్‌గా చేసిన రామ్ చరణ్ 'వినయ విధేయ రామ'లో ఐటమ్ సాంగ్‌లోనూ ఈమె మెరిసింది. 2019 తర్వాత పూర్తిగా సినిమాలు చేయడం మానేసింది. అయితేనేం సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు హాట్ ఫొటోస్ పోస్ట్ చేస్తూ ఎంటర్‌టైన్ చేస్తూనే ఉంటుంది. హార్దిక్ పాండ్య విషయానికొస్తే.. టీమిండియా తరఫున ఆల్‌రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఐపీఎల్‌లో ప్రస్తుతం ముంబై ఇండియన్స్‌కి కెప్టెన్సీ చేస్తున్నాడు. వ్యక్తిగత జీవితానికొస్తే నటాషా స్టాంకోవిచ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీళ్లకు అగస్త్య అని కొడుకు కూడా పుట్టాడు. కానీ కొన్నాళ్లకే మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నారు. ప్రస్తుతానికైతే హార్దిక్ సింగిల్‌గానే ఉంటున్నాడు.





# రజినీకాంత్ కూలీ..
## ఫస్ట్ సింగిల్ వచ్చేసింది!



రజనీకాంత్ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం కూలీ. ఈ సినిమాను లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో నాగార్జున, ఉపేంద్ర, శృతిహాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లియో చిత్రం తర్వాత లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీని దాదాపు రూ. 350 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. చికిటు అంటూ సాగే ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతమందించారు. ఈ పాటకు అరివు లిరిక్స్ అందించారు. ఈ సాంగ్‌ను రాజేందర్, అరివు, అనిరుధ్ రవిచందర్ ఆలపించారు.

**రజినీకి భారీ పారితోషికం..**

ఈ మూవీ బడ్జెట్‌తో పాటు తలైవా రజినీకాంత్ పారితోషికం సైతం భారీగానే ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా కోలీవుడ్‌లో వినిపిస్తోన్న టాక్ ప్రకారం ఆయనకు ఏకంగా రూ.150 కోట్ల రెమ్యునరేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. దీంతో రజినీకాంత్ కెరీర్‌లో కూలీ మూవీ అత్యధిక పారితోషికం చెల్లించిన చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. అంతేకాకుండా ఈ చిత్రానికి డైరెక్టర్ కనగరాజ్ సైతం రూ.50 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు ఓ నివేదికలో వెల్లడైంది. మిగిలిన రూ.150 కోట్లతో సినిమా బడ్జెట్, ఇతర నటీనటులకు ఖర్చు చేయనున్నారు. ఇది కాకుండా నిర్మాతలు పబ్లిసిటీ కోసం దాదాపు రూ. 25 కోట్లు పక్కన పెట్టారని సమాచారం.

# మంచు విష్ణు కార్యాలయంలో జీఎస్టీ అధికారుల సోదాలు



**హైదరాబాద్:** కన్నప్ప చిత్రయూనిట్‌కు భారీ షాక్ తగిలింది. సినిమా రిలీజ్‌కు రెండు రోజుల ముందు జీఎస్టీ అధికారులు సోదాలకు దిగారు. మంచు విష్ణుతో పాటు పలువురి ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం కన్నప్ప. ప్రీతి ముకుందన్ కథానాయిక. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, శరత్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. కన్నప్ప బడ్జెట్‌ను విష్ణు ఎన్నడూ బయటపెట్టలేదు. ఓ ఇంటర్వ్యూలో రూ.100 కోట్లా? రూ.200 కోట్లా? అని అడిగినప్పుడు కూడా చెప్పేందుకు నిరాకరించాడు. ఎంతో చెబితే ఐటీ వాళ్లు తన ఆఫీసుకు వస్తారని, ఎందుకీ గొడవ అని సమాధానం దాటవేశారు. చివరకు సినిమా రిలీజ్‌కు ముందే అధికారులు మంచు విష్ణు కార్యాలయంలో సోదాలకు దిగారు.

# నీల్‌తో బన్నీ సినిమా..
## ఒకవేళ నిజమైతే మాత్రం!

'పుష్ప'తో అల్లు అర్జున్ క్రేజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. దీంతో ఆచితూచి సినిమాలు ప్లాన్ చేసే పనిలో ఉన్నాడు. అప్పటికే ఓకే చేసిన త్రివిక్రమ్ ప్రాజెక్ట్‌ని పక్కనబెట్టేశాడు. తమిళ దర్శకుడు అట్లీకి అవకాశమిచ్చాడు. త్వరలో షూటింగ్ మొదలయ్యే ఈ మూవీ ఓ రేంజులో ఉండబోతుందని ప్రమోషనల్ వీడియోల బట్టి అర్థమవుతోంది. దీని తర్వాత ఎవరితో చేస్తాడా అనే సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. ఇప్పుడు దానికి ఓ సమాధానం దొరికినట్లు అనిపిస్తోంది. మొన్నీమధ్యే 'తమ్ముడు' మూవీ ప్రమోషన్‌లో భాగంగా దిల్ రాజు పలు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఇందులో ఒకదానిలో మాట్లాడుతూ.. వచ్చే ఏడాది అల్లు అర్జున్‌తో ఓ సినిమా మొదలుపెట్టబోతున్నట్లు చెప్పారు. దర్శకుడు ఎవరనేది మాత్రం రివీల్ చేయలేదు. అయితే ఈ ప్రాజెక్ట్ ప్రశాంత్ నీల్‌తోనే అని సోషల్ మీడియాలో గట్టిగా టాక్ వినిపిస్తోంది. అది కూడా నీల్ డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'రావణం' అని అంటున్నారు. లెక్క ప్రకారం 'రావణం' సినిమాని ప్రభాస్‌తో తీయాలని నీల్ అనుకున్నాడట. కానీ ప్రస్తుతం ప్రభాస్‌కి ఉన్న కమిట్‌మెంట్స్ దృష్ట్యా అది సాధ్యం కాకపోవచ్చు. ఇప్పుడు ఎన్టీఆర్‌తో 'డ్రాగన్' చేస్తున్న నీల్.. ఇది పూర్తయిన తర్వాత బన్నీతో కలిసి పనిచేస్తాడనిపిస్తుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌కి దిల్ రాజు నిర్మాతగా వ్యవహరిస్తారని టాక్. ఒకవేళ ఇదే నిజమైతే అంచనాలు ఎక్కడికో వెళ్లిపోవడం గ్యారంటీ. ఎందుకంటే కేజీఎఫ్, సలార్ సినిమాలతో తన స్టాండర్డ్ పెంచేసుకున్న ప్రశాంత్ నీల్.. ఇప్పుడు తారక్‌తో మూవీ చేస్తున్నాడు. కేజీఎఫ్ 3, సలార్ 2 కూడా తీయాల్సి ఉంది కానీ అవి ఇప్పట్లో సాధ్యమవుతాయా? లేదంటే 'రావణం' తీసిన తర్వాత ఈ రెండు ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయా అనిపిస్తుంది. ఏదేమైనా ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో క్రేజీ కాంబినేషన్ల గురించి ఎప్పటికప్పుడు ఏదో ఓ రూమర్ వినిపిస్తూనే ఉంది. మరి వాటిలో ఎన్ని నిజమవుతాయో చూడాలి?



# మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ అంటూ రాబోతున్న హోంబాలే ఫిలింస్




కేజీఎఫ్, కేజీఎఫ్ 2, కాంతార, సలార్ వంటి ప్యాన్ ఇండియా బ్లాక్ బస్టర్లు తీసిన నిర్మాణ సంస్థ హోంబాలే ఫిలింస్ తాజాగా సంచలన విషయం ప్రకటించింది. ఇప్పటికే నటుడు ప్రభాస్‌తో మూడు ప్రాజెక్ట్‌లను ఒకే చేసుకున్న నిర్మాణ సంస్థ తాజాగా 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' అంటూ కొత్త ఫ్రాంఛైజీని తీసుకురాబోతుంది. ఇందులో దాదాపు ఏడు సినిమాలు రాబోతుండగా.. ఒక్కో సినిమా రెండు ఏండ్ల గ్యాప్ తేడాతో 2037 వరకు 7 సినిమాలు రాబోతున్నాయి. 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా మొదటి చిత్రం మహావతార్: నరసింహ 25 జూలై 2025న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. మహావతార్ : పరశురామ్ (2027)లో, మహావతార్ : రఘునందన్ (2029)లో, మహావతార్ : ద్వారకాదీశ్ (2031)లో, మహావతార్ : గోకులానంద్ (2033)లో, మహావతార్ : కల్కి 1 (2035)లో మహావతార్ : కల్కి 2 (2037)లో విడుదల కాబోతున్నాయి. విష్ణుమూర్తి పది అవతారాలపై ఈ సినిమాలు రాబోతుండగా.. వీటిలో మొదటి సినిమా 'మహావతార్: నరసింహ' ఐదు భాషల్లో ఒకేసారి 25 జూలై 2025న రిలీజ్ కానున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది.

# సెంచరీ కొట్టిన కుబేర



ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించిన మల్టీస్టారర్ మూవీ కుబేర. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ చిత్రం జనాలకు విపరీతంగా నచ్చేసింది. జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ తాజాగా కుంభస్థలాన్ని కొట్టేసింది. నాలుగు రోజుల్లోనే వంద కోట్లు కొల్లగొట్టింది. ఈ విషయాన్ని కుబేర చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. రష్మిక మందన్నా కథానాయికగా నటించిన ఈ మూవీకి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించాడు.

**కుబేర కథ**

దీపక్ (నాగార్జున) నిజాయితీ గల సీబీఐ అధికారి. కేంద్రమంత్రి అవినీతి బయటపెట్టడంతో అన్యాయంగా ఆయన్ను జైలుపాలు చేస్తారు. ఆయనకు సహాయం చేయడానికి దేశంలోనే బడా వ్యాపారవేత్త నీరజ్ మిత్రా (జిమ్ సర్భ్) ముందుకు వస్తాడు. ఓ ఒప్పందం చేసుకొని దీపక్‌ని బయటకు తెస్తాడు. ఆ ఒప్పందం ప్రకారం దీపక్ రూ.లక్ష కోట్ల బ్లాక్ మనీని కేంద్ర మంత్రుల బినామీల అకౌంట్లకు బదిలీ చేయాలి. అందులో రూ.50 వేల కోట్లను బ్లాక్‌లో పంపించాలి. దానికోసం దీపక్.. నలుగురు భిక్షగాళ్లను తీసుకొచ్చి వాళ్ల పేరు మీద చెరో రూ.10 వేల కోట్ల చొప్పున అకౌంట్‌లో జత చేస్తాడు. ఆ తర్వాత నలుగురిలో ఒకరైన యాచకుడు దేవా (ధనుష్) తప్పించుకుని పారిపోతాడు. దేవా ఎందుకు తప్పించుకున్నాడు? దేవాను నీరజ్ గ్యాంగ్ పట్టుకుంటుందా? లక్ష కోట్లు చేతులు మారాయా? లేదా? అనేది తెలియాలంటే థియేటర్‌లో సినిమా చూడాల్సిందే!

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

